తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
17-08-2026
సోమవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 190
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



## జనగణనలో బీసీలకు అన్యాయం..

- కులగణనపై కేంద్రం మోసం చేస్తోందని పొన్నం ప్రభాకర్ విమర్శ
- జనగణన సర్క్యులర్‌ను సవరించాలని కేంద్రానికి డిమాండ్
- బీసీల జనాభా లెక్కింపునకు ప్రత్యేక ప్రశ్న చేర్చాలని లేఖ
- ఓబీసీ, ఎస్ఈబీసీలకు ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- శాస్త్రీయంగా, పారదర్శకంగా బీసీల జనాభా నమోదు చేయాలని డిమాండ్

2



## ఇంటర్ ప్రవేశాల గడువు పెంపు!

- ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడిగింపు
- తెలంగాణ ఇంటర్ బోర్డు ఉత్తర్వులు జారీ
- విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు నిర్ణయం
- ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ వెల్లడి
- రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఇంటర్ సీట్లు
- సగానికి పైగా ఖాళీలతో అధికారుల్లో ఆందోళన
- గురుకుల కళాశాలలకు పెరుగుతున్న ఆదరణ
- సాధారణ కళాశాలల్లో తగ్గిన విద్యార్థుల సంఖ్య

2



2

## రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడులు..

- రష్యాపై వందలాది డ్రోన్లతో ఉక్రెయిన్ విరుచుకుపాటు
- 822 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడి
- మాస్కో ప్రాంతంలో భారీగా డ్రోన్ దాడులు
- రష్యాలోని పలు ప్రాంతాల్లో ప్రాణనష్టం, ఆస్తి నష్టం
- మాస్కో సమీపంలోని వేర్‌హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం
- రోస్టోవ్ ప్రాంతంలో ఐదుగురు మృతి
- మాస్కో ప్రాంతంలో మరో వ్యక్తి మృతి
- విమానాశ్రయాల్లో తాత్కాలికంగా ఆంక్షలు

## తెలంగాణ కాంగ్రెస్‌లో అసంతృప్తి

# సునామీ!

- ఏకమవుతున్న 'ధిక్కార' స్వరాలు
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఓ అగ్నిపర్వతం
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- ప్రభుత్వ వైఫల్యాలపై గళం విప్పుతున్న నేతలకు జడ్చర్ల ఎమ్మెల్యే మద్దతు
- కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేల అసంతృప్తి జ్వాలలు
- తుంగతుర్తి కేంద్రంగా కోమటిరెడ్డి బ్రదర్స్ వర్సెస్ సామేల్ మాటల యుద్ధం
- కోమటిరెడ్డి సోదరులపై రేవంత్ సర్కార్ అణచివేత కుట్రల ఆరోపణలు
- కాంగ్రెస్‌లోని అసంతృప్తులందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు పావులు



**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
తెలంగాణ కాంగ్రెస్ నాయకుల ధిక్కార స్వరం ఒక్కరితో మొదలై, పార్టీలోని అసంతృప్తులందరూ ఏకమయ్యే దిశగా వేగంగా పయనిస్తోంది. నల్గొండ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రగిల్చిన అసంతృప్తి జ్వాలలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ అసంతృప్తులను ఒకే తాటిపైకి తెచ్చేలా పరిస్థితులు మారుతున్నాయి. తాజాగా ముఖ్యమంత్రి సొంత జిల్లాకు చెందిన జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఏకంగా రాజగోపాల్ రెడ్డికి మద్దతుగా నిలుస్తూ 'ఆయన ఒక అగ్నిపర్వతం' అంటూ చేసిన సంచలన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇది ఏదో సందర్భానుసారంగా అన్న మాట కాదని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో పెరగనున్న పెద్ద అసంతృప్తి సునామీకి పరోక్ష సంకేతమని రాజకీయ వర్గాల్లో తీవ్రంగా చర్చ సాగుతోంది.

**ఫిరాయింపు ఎమ్మెల్యేల రివర్స్ గేర్**
మరోవైపు గతంలో బీఆర్ఎస్

మిగతా 2 లో..



## కేసీఆర్ సభకు రావాలి..

# సూచనలివ్వాలి

- సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు.. కేసీఆర్‌ను కూడా తీసుకురండి
- పదేళ్ల బీఆర్ఎస్ పాలన.. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చిద్దాం
- విడతల వారీగా ఉద్యోగాల భర్తీ: సీఎం హామీ
- ఉద్యోగాలు ఇవ్వలేనివారే యువతను రెచ్చగొడుతున్నారు
- నిరుద్యోగులు నిరసనల్లో పాల్గొంటే కేసులతో ఇబ్బందులు
- ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు అహర్నిశలు కష్టపడుతున్నాం
- రూ.8.11 లక్షల కోట్ల అప్పులపై చర్చకు సిద్ధమన్న రేవంత్
- రైతులు, ఉద్యోగాలు, మహిళా సంక్షేమంపై ప్రభుత్వ ప్రగతి వివరణ
- ప్రజా పాలన వర్సెస్ కుటుంబ పాలనపై సీఎం ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్, (సిరి న్యూస్):**
అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని బావాబావమరిది (కేటీఆర్, హరీశ్‌రావు) పదే పదే అడుగుతున్నారు.. సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు పెడతామని మీతో పాటు కేసీఆర్‌ను కూడా సభకు తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, రెండున్నరేళ్ల మా కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో జరిగిన పనులపై చర్చిద్దామన్నారు. ఇవాళ పరకాల సభలో మాట్లాడిన సీఎం.. విడతల వారీగా ఉద్యోగాలు భర్తీ చేస్తామని, పదేళ్లలో ఉద్యోగాలు ఇవ్వలేని వారు ఇప్పుడు మన పిల్లలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని సీఎం అన్నారు. అగ్గిపెట్టేరావు, అఘోరరావు మాటలు వింటే మోసపోతారని నిరుద్యోగులు నిరసనల్లో పాల్గొంటే కేసులతో ఇబ్బందిపడతారని

మిగతా 2 లో..

## బాలీవుడ్ నటులకు నోటీసులు!

- నిషేధిత పాన్ మసాలాలకు ప్రచారం
- మహారాష్ట్ర ఆహార, ఎఫ్‌డీఏ షాక్
- షారుఖ్, అజయ్, టైగర్ ష్రాఫ్‌లకు నోటీసులు
- ప్రచార వీడియోలు తొలగించాలని ఆదేశం
- 'విమల్ ఇలాచీ' పేరుతో తప్పుదోవ
- ప్రకటన ఒప్పందాలు, పారితోషికాలపై ఆరా
- రూ.10 లక్షల నుండి రూ. 50 లక్షల వరకు జరిమానా
- 3 ఏళ్ల పాటు నిషేధం విధించే అవకాశం

**ముంబాయి, (సిరి న్యూస్):**
పరోక్ష ప్రకటనల (సరోగేట్ అడ్వర్టైజ్‌మెంట్స్) ద్వారా నిషేధిత పాన్ మసాలా బ్రాండ్లకు ప్రచారం కల్పిస్తున్న ప్రముఖ బాలీవుడ్ నటులపై మహారాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా పాన్ మసాలాలకు

మిగతా 3 లో..



## సోనియా గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా అడ్డుకున్నారు
- స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం ఘటనపై ఆరోపణలు
- ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతీయ గేయాన్ని అవమానించారని వ్యాఖ్య
- దేశ ప్రజలంతా ఈ ఘటనను చూశారని అమిత్‌షా వెల్లడి
- వందేమాతరాన్ని అవమానించినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్
- కాంగ్రెస్‌ను దేశ ప్రజలు ఎన్నటికీ క్షమించరని వ్యాఖ్య
- ఇటువంటి చర్యలు సిగ్గుచేటని మండిపాటు
- చిత్తోర్‌గఢ్ ర్యాలీలో అమిత్‌షా తీవ్ర వ్యాఖ్యలు
- నిరసనకు యత్నించిన 24 మంది కాంగ్రెస్ నేతల తరలింపు

**న్యూఢిల్లీ, (సిరి న్యూస్):**
కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్ర విమర్శలు చేశారు. శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా సోనియా గాంధీ అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ ఘటనను దేశ ప్రజలందరూ కళ్లారా చూశారని పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతీయ గేయాన్ని అవమానించారని మండిపడ్డారు. వందేమాతరాన్ని అవమానించినందుకు కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అమిత్‌షా డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు

మిగతా 2 లో..



## సనత్‌నగర్‌లో నయా వైద్య శోభ..

# ఎంసీఆర్ టిమ్స్ ప్రారంభం



- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- కార్యక్రమానికి హాజరుకానున్న మంత్రి దామోదర రాజనర్సింహ
- ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించడమే లక్ష్యం

**హైదరాబాద్, (సిరి న్యూస్):**
రాష్ట్ర ప్రజారోగ్య రంగానికి నయా శోభను చేకూరుస్తూ సనత్‌నగర్‌లో నిర్మించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎంసీఆర్ టిమ్స్) సోమవారం అధికారికంగా ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవం ఘనంగా జరగనుంది.

మిగతా 2లో..

## పెట్రోల్, డీజిల్ ఆటోలకు

# ఈవీ మార్పిడి పథకం



- హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ లో పథకం అమలు
- 18,766 ఆటోలకు ప్రయోజనం
- పెట్రోల్, డీజిల్ ఆటోలను ఈవీలుగా మార్చే అవకాశం
- పాత ఆటోలను రెట్రోఫిట్ చేసే అవకాశం
- కొత్త ఈవీ ఆటోలు కొనుగోలు చేసేవారికీ సాయం
- ఒక్కో ఆటోకు రూ.1.5 లక్షల వరకు సాయం
- పథకం కోసం రూ.200 కోట్ల బడ్జెట్
- ఆటో డ్రైవర్లపై ఇంధన వ్యయం తగ్గించే లక్ష్యం

**హైదరాబాద్, (సిరి న్యూస్):**
తెలంగాణ ప్రభుత్వం ఆటో రిక్షాలను విద్యుత్ వాహనాలుగా మార్చేందుకు కొత్త పథకాన్ని అమలు చేయనుంది. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని పెట్రోల్, డీజిల్ ఆటోలను ఈవీలుగా మార్చడంతోపాటు కొత్త ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసేందుకు కూడా ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించింది.

మిగతా 3లో..

## జనగణనలో బీసీలకు అన్యాయం..

**హైదరాబాద్, (సిరి న్యూస్):**

దేశవ్యాప్త కులగణనపై కేంద్రం మోసం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. జనగణనలో కులగణన చేస్తామని గతంలో ప్రకటించిన మోడీ లెక్కల సేకరణకు వచ్చేసరికి మోసం చేశారని విమర్శించారు. జనగణనపై కేంద్రం ఇచ్చిన సర్క్యులర్ ను సవరించి దేశంలో బీసీల జనాభా ఎంత ఉందో తెలుసుకునే ప్రశ్నను చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 2027 జనాభా లెక్కల్లో ఓబీసీ/ఎస్ఈబీసీ (సోషల్లీ అండ్ ఎడ్యుకేషనల్లీ బ్యాక్వర్డ్ క్లాసెస్) లకు ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీకి పొన్నం ప్రభాకర్ ఆదివారం లేఖ రాశారు. 2027 జనాభా లెక్కల్లో ఓబీసీ/ఎస్ఈబీసీల జనాభాను శాస్త్రీయంగా, పారదర్శకంగా నమోదు చేసేలా ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని కొరారు.

**తెలంగాణ అనుభవాన్ని పరిగణలోకి తీసుకోండి:**

ఎస్సీ, ఎస్టీతో పాటు ఓబీసీలకు ప్రత్యేక కేటగిరీ, రాష్ట్రాల వారీగా మాస్టర్ కుల డైరెక్టరీ, కులాలకు ప్రత్యేక డిజిటల్ కోడ్‌లు ఏర్పాటు చేయాలని కొరారు. 2011 ఎస్ఈసీసీలో ఎదురైన కులాల పేర్లు, స్పెల్లింగ్‌లు, ఉపకులాల సమస్యలు పునరావృతం కాకుండా ప్రమాణీకృత విధానం అవలంబించాలని, తెలంగాణలో నిర్వహించిన SEEPC సర్వే అనుభవాన్ని కూడా 2027 జనాభా లెక్కల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. వెనుకబడిన వర్గాల వాస్తవ జనాభా, సామాజికఆర్థిక పరిస్థితులపై ప్రామాణిక సమాచారం ఉంటేనే రిజర్వేషన్లు, విద్య, ఉపాధి, సంక్షేమం, సమాన ప్రాతినిధ్యానికి సమర్థవంతమైన విధానాలు రూపొందించగలం అని లేఖలో పేర్కొన్నారు.

**బండి సంజయ్ మాట్లాడకపోవడం బాధాకరం**

ఇవాళ గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన పొన్నం బీసీ కులగణనపై కేంద్ర వైఖరిని ఖండించారు. జనగణనపై కేంద్రం విడుదల చేసిన ప్రశ్నావళిలో బీసీల ప్రస్తావన లేదని జనగణన పత్రం 40 ప్రశ్నల్లో ఎస్సీ, ఎస్టీల ప్రస్తావన మాత్రమే ఉందని విమర్శించారు. పూర్తి స్థాయి కులగణన చేస్తామని చెప్పి ప్రశ్నావళిలో బీసీల ప్రస్తావన పేర్కొనలేదని దుయ్యబపట్టారు. బీసీ అని చెప్పుకునే మోడీ బీసీల కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఒత్తిడి వల్లే దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్రం దిగివచ్చిందని అయితే జనగణనలో కులగణన చేస్తామని గతంలో ప్రకటించిన మోడీ లెక్కల సేకరణకు వచ్చేసరికి మోసం చేశారని విమర్శించారు. జనగణనపై కేంద్రం ఇచ్చిన సర్క్యులర్ ను సవరించి దేశంలో బీసీల జనాభా ఎంత ఉందో తెలుసుకునే ప్రశ్నను చేర్చాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎవరి జనాభా ఎంత ఉందో తెలిస్తే న్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు ఇంత అన్యాయం జరుగుతుంటే బీసీ అయిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా స్పందించకపోవడం బాధాకరం అన్నారు. బండి సంజయ్ వందేమాతరం గురించి కాదు బీసీల గురించి మాట్లాడాలన్నారు.

## సనత్‌నగర్‌లో నయా వైద్య శోభ..
## ఎంసీఆర్ టిమ్స్ ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

పాల్గొంటారు.

**కార్పొరేట్‌కు దీటుగా వసతులు..**

పేద, మధ్యతరగతి ప్రజలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ తరహా వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని తీర్చిదిద్దారు. 1082 పడకల సామర్థ్యంతో రూపుదిద్దుకున్న ఈ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ కోసం ప్రత్యేకంగా 300 ఐసీయూ పడకలు, సంక్లిష్టమైన సర్జరీల కోసం 31 అత్యాధునిక మేజర్ ఆపరేషన్ థియేటర్లను సిద్ధం చేశారు. నిన్నటి వరకు సాధారణ ఓపీ సేవలు, ట్రయల్ రన్ మాత్రమే కొనసాగగా.. ప్రారంభోత్సవంతోనే పూర్తిస్థాయి సూపర్ స్పెషాలిటీ సేవలు అధికారికంగా రోగులకు అందుబాటులోకి రానున్నాయి.

**సమగ్ర వైద్యం.. ఒకే ప్రాంగణం**

గుండె, కిడ్నీ, కాలేయం, మెదడు సంబంధిత వ్యాధులతో పాటు అత్యవసర ట్రామా, క్యాన్సర్, అవయవ మార్పిడి వంటి 37 ప్రధాన వైద్య విభాగాలకు చెందిన నిపుణులు ఇక్కడ సేవలు అందించనున్నారు. కార్డియాక్, రీనల్, న్యూరో, ట్రామా వంటి కీలక రంగాల్లో ప్రత్యేక 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' కేంద్రాలతో పాటు అధునాతన ఇంటర్వెన్షనల్ రేడియాలజీ, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు రోగులకు వేగవంతమైన వైద్య పరీక్షలను అందించనున్నాయి. ఈ భారీ ప్రాజెక్టు ప్రారంభంతో రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే రోగులకు గాంధీ, ఉస్మానియా, నిమ్స్‌లపై ఉండే భారం తగ్గి, నాణ్యమైన స్పెషాలిటీ వైద్యం మరింత చేరువ కానుంది.

**ప్రారంభోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలి**

తెలంగాణ ప్రభుత్వ వైద్యరంగంలో చారిత్రాత్మక ఘట్టమైన టిమ్స్ ఆసుపత్రి ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జరగనున్న ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వైద్యులు, మీడియా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆదివారం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆరోగ్యశాఖ, పోలీస్, జీహెచ్ఎంసీ, జలమండలి, ఐ అండ్ పీఆర్, ట్రాఫిక్ విభాగాల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమ వేదిక, ఎంట్రీ/ఎగ్జిట్ మార్గాలు, బందోబస్తు, క్రౌడ్ మేనేజ్‌మెంట్, పార్కింగ్‌లపై మంత్రి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పోలీసులకు స్పష్టం చేశారు. అలాగే ప్రాంగణంలో పరిశుభ్రత, నిరంతర తాగునీరు, విద్యుత్ సరఫరాలో లోపాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఎంసీఆర్ టిమ్స్ డైరెక్టర్ డా. నరేంద్ర కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ముకుంద రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డి, ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడులు..

- **మాస్కో ప్రాంతంలో మరో వ్యక్తి మృతి**
- **విమానాశ్రయాల్లో తాత్కాలికంగా ఆంక్షలు**
- **క్రిమియాపైనా ఉక్రెయిన్ భారీ దాడులు**
- **కీవ్‌పై రష్యా డ్రోన్, క్షిపణి దాడులు**

**నేషనల్‌బ్యూరో, (సిరి న్యూస్):**

రష్యా పై ఉక్రెయిన్ భారీ స్థాయిలో డ్రోన్ దాడులు చేసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు రష్యాలోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగినట్లు అధికారులు తెలిపారు. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకారం.. దేశవ్యాప్తంగా 822 ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డుకున్నట్లు పేర్కొంది. ఈ దాడుల్లో కనీసం ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు రష్యా అధికారులు వెల్లడించారు.

మాస్కో ప్రాంతంలోనూ భారీగా డ్రోన్లు దూసుకొచ్చాయి. పొడోల్స్క్ ప్రాంతంలోని వైల్డ్‌బెరీస్ సంస్థకు చెందిన గిడ్డంగి దెబ్బతిని భారీగా మంటలు చెలరేగాయి. మాస్కో ప్రాంతంలో ఓ ఇంటిపై డ్రోన్ పడటంతో 83 ఏళ్ల వృద్ధుడు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. రోస్టోవ్ ప్రాంతంలో జరిగిన దాడుల్లో ఐదుగురు మృతి చెందినట్లు సమాచారం. దాడుల నేపథ్యంలో మాస్కో ప్రాంతంలోని విమానాశ్రయాల వద్ద తాత్కాలికంగా విమాన రాకపోకలపై ఆంక్షలు విధించారు. దీంతో పలు విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మరోవైపు క్రిమియాలోని సైనిక, ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ దాడులు కొనసాగించింది. రష్యా ఆక్రమణలో ఉన్న ప్రాంతాల్లోని సైనిక సరఫరా మార్గాలు, కీలక మౌలిక సదుపాయాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి దాడులను ముమ్మరం చేస్తోంది. ఇదే సమయంలో రష్యా కూడా ఉక్రెయిన్‌పై విరుచుకుపడింది. ఆదివారం తెల్లవారుజామున కీవ్ నగరంపై రష్యా డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేయగా..

# కల్యాణలక్ష్మి రద్దుకు కాంగ్రెస్ కుట్ర

మొదటిపేజీ తరువాయి

షాదీ ముబారక్ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదని, తెలంగాణ పేద కుటుంబాల ఆడబిడ్డల భవిష్యత్తు, ఆత్మగౌరవంతో ముడిపడిన కార్యక్రమాలని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన వెంటనే పేద కుటుంబాల్లో ఆడబిడ్డ పెళ్లి ఎంతటి ఆర్థిక భారమో గుర్తించిన కేసీఆర్ 2014 అక్టోబర్ 2న ఈ పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు. రూ.51 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభమైన ఈ పథకాన్ని దశలవారీగా రూ.75,116కు, అనంతరం రూ.1,00,116కు పెంచారని తెలిపారు. కేసీఆర్ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందిందన్నారు. కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి ద్వారా పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. అయితే ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని బలోపేతం చేయాల్సింది పోయి దానినే రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. కల్యాణలక్ష్మి కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఆడబిడ్డ ఇప్పుడు ఎన్నికల హామీ ప్రకారం తులం బంగారం కూడా డిమాండ్ చేస్తుండటంతో, ఆ ప్రశ్నల నుంచి తప్పించుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్హులైన లబ్ధిదారులే చెబుతున్నారని అన్నారు. పెళ్లిళ్లు జరిగి చాలా కాలం గడిచినా, కొందరికి పిల్లలు పుట్టినా కూడా తమకు రావాల్సిన కల్యాణలక్ష్మి సహాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారని ధ్వజమెత్తారు. చాలా కాలం తర్వాత ఆమోదం పొందిన దరఖాస్తులకు సంబంధించిన చెక్కులు కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాకుండా ఆగిపోయాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అర్హులైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కల్యాణలక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేకపోయిందని నిలదీశారు. ముఖ్యమంత్రి, మంత్రులు అవినీతి వంటి హైడ్రా వంటి అంశాల్లో ప్రైవేటు న్యాయవాదులకు భారీ మొత్తాలు చెల్లించి వాదించే ప్రభుత్వం, ఆడబిడ్డల హక్కులకు సంబంధించిన పథకాన్ని కాపాడుకునే విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ప్రశ్నించారు.

హైకోర్టు తీర్పును ఇప్పుడు సాకుగా చూపుతూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా నిలిపివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పటికే కేసీఆర్ హయాంలో అమలైన పలు సంక్షేమ కార్యక్రమాలను నిలిపివేసిన కాంగ్రెస్, ఇప్పుడు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లను కూడా రద్దు చేయాలని చూస్తోందని విమర్శించారు. "ఆడబిడ్డ భారం కాదు.. భరోసా" అనే భావనకు కేసీఆర్ ప్రభుత్వం రూపమిచ్చిందని కేటీఆర్ అన్నారు. అలాంటి పథకాలను రద్దు చేస్తే తెలంగాణ ఆడబిడ్డలు, వారి కుటుంబాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతాయని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి తులం బంగారం వంటి హామీలతో ఓట్లు పొందిన కాంగ్రెస్ ఇప్పుడు వాటిని మరిచిపోయిందని మండిపడ్డారు.

రేపు రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిర్వహించే నిరసనల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పేదింటి ఆడబిడ్డల పక్షాన తమ గళాన్ని వినిపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. "కల్యాణలక్ష్మి ఏమైంది? షాదీ ముబారక్ ఏమైంది? ఎన్నికల్లో హామీ ఇచ్చిన తులం బంగారం ఎప్పుడు ఇస్తారు?" అంటూ కాంగ్రెస్ నేతలను ప్రజలు ప్రశ్నించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆడబిడ్డల కోసం కేసీఆర్ చేసిన సంక్షేమ కార్యక్రమాలను కాపాడుకుందాం.. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయించేలా ఒత్తిడి పెంచేందుకు పోరాడుదాం అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## ఇంటర్ ప్రవేశాల గడువు పెంపు!

- **సగానికి పైగా ఖాళీలతో అధికారుల్లో ఆందోళన**
- **గురుకుల కళాశాలలకు పెరుగుతున్న ఆదరణ**
- **సాధారణ కళాశాలల్లో తగ్గిన విద్యార్థుల సంఖ్య**

**హైదరాబాద్, (సిరి న్యూస్):**

తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్యా మండలి తీపి కబురు అందించింది. ప్రవేశాల ప్రక్రియకు సంబంధించిన గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగిస్తూ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణంగా ప్రవేశాల గడువు ఈనెల 15వ తేదీతోనే ముగిసింది. అయితే, ఇంకా వేలాది మంది విద్యార్థులు ఎటువంటి కళాశాలల్లో చేరకపోవడంతో పాటు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల నుంచి వచ్చిన అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పొడిగించిన సమయాన్ని వినియోగించుకుని విద్యార్థులందరూ వెంటనే తమకు నచ్చిన కోర్సులలో చేరాలని సూచించారు.

ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను విశేషంగా పెంచాలని ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే, గత రెండు నెలలుగా ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ రాష్ట్రంలో అందుబాటులో ఉన్న సీట్లలో సగానికి పైగా భర్తీ కాకుండా ఖాళీగా ఉండిపోవడం అధికారులను తీవ్రంగా కలిచివేస్తోంది. ప్రవేశాల ప్రక్రియపై ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు నిరంతరం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, సీట్ల భర్తీని వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు విద్యార్థులను ఆకర్షించేందుకు అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ మరియు ప్రభుత్వ ఆధ్వర్యంలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలతో కలిపి మొత్తం 3,200 ఇంటర్మీడియట్ కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ గురుకులాలు, రెసిడెన్షియల్ కళాశాలల్లో అడ్మిషన్ల పరిస్థితి చాలా బలంగా ఉంది. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో కూడా చేరికలు సంతృప్తికరంగానే ఉన్నాయి. కానీ, హాస్టల్ సౌకర్యం లేని సాధారణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మాత్రం విద్యార్థులను ఆకర్షించడంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. గత వేసవి సెలవుల్లో ప్రభుత్వ అధ్యాపకులు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించకపోయి ఉంటే, అడ్మిషన్ల సంఖ్య మరింత దారుణంగా ఉండేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రస్తుతం పొడిగించిన రెండు వారాల గడువు వల్ల అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పుంజుకుంటుందని ఇంటర్ బోర్డు అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రవేశాలు పొందాలనుకునే ఆసక్తిగల విద్యార్థులు నేరుగా తమ సమీపంలోని కళాశాలలకు వెళ్లి ఆఫ్‌లైన్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చు. అంతేకాకుండా, ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ (www.tgbie.gov.in) సందర్శించి ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. తమ విద్యా వివరాలను నమోదు చేసుకుని, నచ్చిన కళాశాల మరియు గ్రూప్‌ను ఎంచుకునేందుకు వెబ్‌సైట్‌లో సౌకర్యం కల్పించారు. ఇదే సమయంలో ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థలపై ఇంటర్ బోర్డు నిఘా పెంచింది. ఇంటర్ ప్రవేశాల పేరుతో ఎటువంటి ప్రవేశ పరీక్షలు (ఎంట్రన్స్ టెస్ట్‌లు) నిర్వహించవద్దని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలను ప్రభుత్వం తీవ్రంగా హెచ్చరించింది. అడ్మిషన్ల పేరుతో అదనపు రుసుములు వసూలు చేసినా లేదా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే అటువంటి కళాశాలలపై గుర్తింపు రద్దుతో సహా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని ఆదిలాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జితేందర్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్ స్థాయికి ధీటుగా సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ బోధన అందిస్తున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా, జాతీయ స్థాయిలో నిర్వహించే ఎంసెట్, నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు ఉచితంగా నాణ్యమైన కోచింగ్ ఇస్తున్నామని చెప్పారు. లక్షల రూపాయల ఆర్థిక భారం లేకుండా ఉచితంగా విద్యను పొందడానికి ఇంటర్ లో చేరే విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలను ఎంచుకోవాలని ఆయన కోరారు. మొత్తానికి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులకు ఈ నెలాఖరు వరకు దక్కిన ఈ చివరి అవకాశాన్ని సరిగ్గా వినియోగించుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేస్తున్నారు. పదో తరగతి పూర్తయి ఇంకా కళాశాలల్లో చేరని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరుతున్నారు.

## తెలంగాణ కాంగ్రెస్‌లో అసంతృప్తి సునామీ!

మొదటిపేజీ తరువాయి

నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి చేరిన ఎమ్మెల్యేలు ఒక్కొక్కరిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరుపై బాహాటంగానే తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. స్థానికంగా ఉన్న కాంగ్రెస్ ఇన్‌ఛార్జులతో పొసగక పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇప్పటికే కాంగ్రెస్‌కు దూరమై సొంత గూటికి చేరుకున్నారు. అంతేకాకుండా మున్సిపల్ ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని మున్సిపాలిటీలను కైవసం చేసుకుని తన సత్తా చాటారు. ఇక బాన్స్వాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అయితే అసలు తాను కాంగ్రెస్ కండువానే కప్పుకోలేదని, కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే మద్దతు ఇచ్చానని, కానీ బకాయి నిధులు కూడా ఇవ్వడం లేదని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వీరితో పాటు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎన్నో సార్లు తన అసంతృప్తిని వెళ్లగక్కారు. ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి పేరు కల్వకుంట అని ఆపై మార్చి రేవంత్ రెడ్డి అని సంబోధించడం కూడా పొరపాటు కాదన్నట్టు కనిపించింది. అలాగే గద్వాల ఎమ్మెల్యే సైతం స్థానిక కాంగ్రెస్ నేతలతో పొసగక ఇప్పటికి కాంగ్రెస్ పార్టీతో అంటీముట్టనట్టే ఉంటున్నారు. వీరికి తోడు ఒకరిద్దరు తిరుగుబాటు నేతలు తప్ప అందరు ప్రభుత్వంపై తీవ్ర తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు.

**తుంగతుర్తి వేదికగా రగిలిన చిచ్చు**

కాంగ్రెస్‌లోనే ఉంటూ సొంత నియోజకవర్గాల్లో ప్రతిపక్ష పాత్ర పోషించాల్సి వస్తోందని పలువురు నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కోమటిరెడ్డి సోదరుల వ్యవహారంలో తుంగతుర్తి నియోజకవర్గం కేంద్రంగా జరిగిన పంచాయితీ రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన మందుల సామేల్ 'నాకు తెలియకుండా నా నియోజకవర్గానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎలా వస్తారు' అంటూ చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే లేపాయి. ఆ తర్వాత మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మధ్య మాటల యుద్ధం సాగి, చివరికి పోటాపోటీ సభల వరకు వెళ్లింది. ఇటీవల ఏపూరి సోమన్న ఆధ్వర్యంలో జరిగిన సభలో రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ అధిష్ఠానానికి మింగుడుపడని విధంగా మారాయి.

**రేవంత్ సర్కార్‌పై రాజగోపాల్ రెడ్డి బాణాలు**

రవీంద్రభారతి వేదికగా జరిగిన సభలో రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లకు ఇచ్చే రూ.5 లక్షల బిల్లులకు అధికారులు 500 నిబంధనలు పెడుతున్నారని, అదే సమయంలో కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేని వ్యాపారులకు, నేతలకు వేల కోట్లు అప్పనంగా అప్పజెబుతున్నారంటూ పరోక్షంగా సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌ను తీవ్రంగా నిలదీశారు. ప్రజల పక్షాన గళం విప్పితే తప్పుగా చిత్రీకరిస్తున్నారని, తాము ఎప్పుడూ ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పోరాడతామని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కూడా రాజగోపాల్ రెడ్డికి మద్దతు పలుకుతూ సమస్యలు పరిష్కరిస్తే కాంగ్రెస్ పార్టీకే లాభం కదా అని, ప్రజల పక్షాన గళం వినిపిస్తూనే ఉంటామని తేల్చిచెప్పడం గమనార్హం.

**కోమటిరెడ్డి సోదరులపై అణచివేత కుట్రలు?**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న కోమటిరెడ్డి సోదరులను పక్కా ప్రణాళిక ప్రకారం అణచివేసే కుట్రలు జరుగుతున్నాయనే ఆరోపణలు వారి వర్గీయుల నుంచి వస్తున్నాయి. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రి అయినప్పటికీ, ఆయనను కేవలం నల్గొండ నియోజకవర్గానికే పరిమితం చేసేలా స్వంత జిల్లాలోనే స్వేచ్ఛ లేకుండా ఒక వర్గం వ్యవహరిస్తోందని, ఇందుకు సీఎం రేవంత్ రెడ్డి పరోక్షంగా సహకరిస్తున్నారని కోమటిరెడ్డి వర్గం ఆరోపిస్తోంది. ఇక రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో స్థానం దక్కకుండా చూడటం, గతంలో భువనగిరి ఎంపీగా చేసిన ఆయనతో సంప్రదించకుండా యాదగిరిగుట్ట పాలకమండలిని నియమించడం, నియోజకవర్గ అభివృద్ధి నిధులు మరియు బిల్లుల మంజూరులో పక్షపాతం చూపడం వంటి అంశాలు పరిస్థితిని మరింత దిగజార్చాయి.

**కాంగ్రెస్‌లో పొలిటికల్ సునామీ రానుందా?**

సొంత పార్టీలోనే జరుగుతున్న ఈ వరుస అణచివేత చర్యలను తిప్పికొట్టేందుకు కోమటిరెడ్డి సోదరులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలందరినీ ఒకే వేదికపైకి తెచ్చి కాంగ్రెస్ అధిష్ఠానానికి తమ రాజకీయ బలమేమిటో నిరూపించేందుకు పావులు కదుపుతున్నారు. ప్రజా సమస్యల పైనే తమ సమరమని, అసంతృప్తివాదులంతా ఏకమైతే పార్టీకి తగిన బుద్ధి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనా కోమటిరెడ్డి బ్రదర్స్ ధిక్కార స్వరంతో మొదలైన ఈ అంతర్గత వివాదం, రాబోయే రోజుల్లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఎటువంటి రాజకీయ ప్రళయాన్ని సృష్టిస్తుందో వేచి చూడాల్సిందే!



## పెట్రోల్, డీజిల్ ఆటోలకు
## ఈవీ మార్పిడి పథకం

మొదటిపేజీ తరువాయి

సాయం అందించనుంది. అలాగే కొత్త ఈవీ ఆటో కొనుగోలు చేసేవారికి కూడా ఇదే స్థాయిలో ఆర్థిక సహాయం అందించే విధంగా పథకాన్ని రూపొందిస్తోంది.

ఈ పథకం కోసం రూ.200 కోట్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆటో డ్రైవర్లకు ప్రతిరోజూ అయ్యే ఇంధన వ్యయాన్ని తగ్గించడం, వారి ఆదాయాన్ని పెంచడం, హైదరాబాద్‌లో వాహన కాలుష్యాన్ని నియంత్రించడం ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం పేర్కొంది.

ఇప్పటికే తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులో 100 శాతం మినహాయింపును అమలు చేస్తోంది. 2024 నవంబర్ 16న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాలకు కూడా ఈ మినహాయింపు వర్తిస్తోంది.

అంతకుముందు హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు ప్రభుత్వం రెట్రోఫిట్ విధానాన్ని ప్రోత్సహించింది. 2026 మేలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కో ఆటో రెట్రోఫిట్టింగ్‌కు సుమారు రూ.1.20 లక్షల వ్యయం అవుతుందని, ఆ ఖర్చును ప్రభుత్వమే భరించనున్నట్లు ప్రకటించారు.

## సోనియా గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

మొదటిపేజీ తరువాయి

సిగ్గుచేటని విమర్శించారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీని దేశ ప్రజలు ఎన్నటికీ క్షమించరని అన్నారు. రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్‌లో నిర్వహించిన ర్యాలీలో అమిత్‌షా ఈ వ్యాఖ్యలు చేశారు.

**పోలీసుల అదుపులో విద్యార్థులు**

అమిత్‌షా పర్యటనకు ముందు రాజస్థాన్ పోలీసులు కాంగ్రెస్ నాయకులతో పాటు పలువురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. అమిత్‌షా ర్యాలీ నేపథ్యంలో నిరసన చేపట్టేందుకు విద్యార్థులతో పాటు 24 మంది కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారు. పేపర్ లీక్‌లు, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులపై కేంద్ర మంత్రి స్పందించాలని డిమాండ్ చేస్తూ వారు నిరసనకు యత్నించారు.

దీంతో పోలీసులు వారిని అక్కడి నుంచి బలవంతంగా తరలించారు. ఈ అరెస్టులకు నిరసనగా వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, విద్యార్థులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు.



## స్వశక్తితో ఎదిగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలి

- **చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**

**మొయినాబాద్,ఆగష్టు 16 (సిరి న్యూస్):**

యువత స్వశక్తితో ఎదిగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని చేవెళ్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ వార్డులో స్థానిక నాయకులతో కలిసి ఆయన 'క్రిసెంట్ ఎనర్జీ' సౌర శక్తి సంస్థను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ సోలార్‌ను వినియోగించడం ద్వారా నివాస, వాణిజ్య సంస్థలకు విద్యుత్ ఖర్చు చాలా వరకు తగ్గుతుందని స్పష్టం చేశారు.వ్యాపార సంస్థలకు సోలార్ ప్లాంట్లు ఎంతగానో ఉపయోగపడతాయని, వినియోగదారులకు ఇవి సరసమైన ధరలకే అందించాలని యజమానులను కోరారు. అలాగే సోలార్ వాడకం వల్ల విద్యుత్ ఆదా కావడంతో పాటు పర్యావరణానికి కూడా ఎంతో అనుకూలంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కుత్బుద్దీన్‌గూడా సర్పంచ్ మహమ్మద్ పాషా,నాయకులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 1న జరిగే చలో ఢిల్లీని జయప్రదం చేయండి

- **సిపిఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్**
- **దేశంలో నిత్యవసర వస్తువుల ధర వెంటనే తగ్గించాలి**
- **సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఓమయ్య**
- **లేబర్ కోడ్లను రద్దుచేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి**
- **సిపిఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జి దుబాస్ రాములు**

**కోటగిరి, ఆగస్టు 16(సిరి న్యూస్):**కేంద్ర ప్రభుత్వం అవిలంబిస్తున్న ప్రజా, కార్మిక,రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్ మంతర్ గ్రౌండ్లో జరిగే భారీ బహిరంగ సభలో పెద్ద ఎత్తున పాల్గొని సిపిఐ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐ కోటగిరి మండల స్థాయి కార్యకర్తల సమావేశం కోటగిరి మండల కేంద్రంలో ఏ.విటల్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు వై.ఓమయ్య, బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జ్ దుబాస్ రాములు హాజరై మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాల క్రితం దేశంలో అధికారంలోకి రాగానే నల్లధనాన్ని వెనక్కు తీసుకువచ్చి ప్రతి కుటుంబానికి 15 లక్షల రూపాయలు వారి వ్యక్తిగత ఖాతాలో వేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాట తప్పిందని, ప్రజా సంక్షేమానికి నిధులు లేవని చెబుతూ కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలను మాఫీ చేస్తున్నదని అన్నారు. ప్రస్తుతం ప్రజలు అనునిత్యం వాడుతున్న నిత్యవసర వస్తువుల ధరలను రోజు,రోజు పెంచుతూ ప్రజలపై భారాలనుమోపుతున్నదని, స్వాతంత్రం రాకమందు వచ్చిన తర్వాత పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలన్నీ రద్దుచేసి 4 లేబర్ కోడ్ లను తీసుకువస్తున్నారని, రైతాంగం పండించే పంటలకు స్వామినాథన్ సిఫారసు మేరకు గిట్టుబాటు ధరలు పెంచకపోగా విదేశీ వాణిజ్యం పేరుతో ఇతర దేశాల నుండి పంట ధాన్యాలను తెచ్చి దేశంలో పండే పంటలకు ధరలు లేకుండా చేసే కుట్ర జరుగుతున్నానని అన్నారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 1న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల నాయకులు నల్ల గంగాధర్, పోతంగల్ మండల కార్యదర్శి కొట్టె ప్రసాద్,



## గ్రామ దేవతలు పూజించడం మన సంప్రదాయం

- **మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్**

**అనంతగిరి ఆగస్టు 16(సిరి న్యూస్):**

గ్రామ దేవతలు పూజించడం మన సంప్రదాయం అని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చనుపల్లి, అమీనాబాద్ గ్రామాల్లో నిర్వహించిన ముత్యాలమ్మ జాతర మహోత్సవాల్లో కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని , గ్రామ దేవతలైన ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, వర్షాలు సకాలంలో కురిసి, చెరువులు, కుంటలు నీటితో నిండి, పంటలు సమృద్ధిగా పండాలని, రైతులు కూలీలు, గ్రామీణ ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామ దేవతల జాతరలు మన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకలుగా నిలుస్తాయని, తరతరాలుగా వస్తున్న ఈ పండుగలను గ్రామ ప్రజలు ఐక్యతతో నిర్వహించుకోవడం అభినందనీయమని అన్నారు. జాతర సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, ప్రజల మధ్య సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ముఖ్య నాయకులు, కార్యకర్తలు,భక్తులు పాల్గొన్నారు.



# బాలీవుడ్ నటులకు నోటీసులు!

**మొదటిపేజీ తరువాయి**

ప్రచారం చేసినందుకు గాను ప్రముఖ నటులు షారుఖ్ ఖాన్, అజయ్ దేవగణ్, టైగర్ ష్రాఫ్‌లకు మహారాష్ట్ర ఆహార, ఔషధ పరిపాలన శాఖ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. తక్షణమే ఇలాంటి తప్పుదోవ పట్టించే ప్రచారాలకు పూర్తిగా దూరంగా ఉండాలని అధికారుల బృందం స్పష్టం చేసింది. అంతేకాకుండా, ఇప్పటి వరకు తమ సోషల్ మీడియా వేదికల్లో పోస్ట్ చేసిన ప్రకటనల కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశించింది.

ప్రజారోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని మహారాష్ట్రలో విమల్ పాన్ మసాలా తయారీ, నిల్వ, విక్రయాలపై ప్రభుత్వం ఇదివరకే పూర్తిస్థాయి నిషేధం విధించింది. అయితే సదరు తయారీదారులు 'విమల్ ఇలాచీ' అనే పేరుతో యథేచ్ఛగా ప్రకటనలు రూపొందించి వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎఫ్‌డీఏ ఆరోపించింది. ఈ ప్రకటనలు పరోక్షంగా నిషేధిత పాన్ మసాలా ఉత్పత్తినే ప్రోత్సహించేలా ఉన్నాయని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సదరు కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాల పత్రాలు, ప్రచార వివరాలు, లభించిన పారితోషికం వివరాలు మరియు నిబంధనల పాటింపునకు సంబంధించిన ఆధారాలను తమ ముందు సమర్పించాలని నటులను ఆదేశించింది.

వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం ఇటువంటి తప్పుదోవ పట్టించే ప్రకటనల్లో నటించి ప్రచారం కల్పించినందుకు నటులకు భారీ జరిమానాలు విధించే అవకాశం ఉంది. ఈ చట్టం కింద రూ. 10 లక్షల నుండి రూ. 50 లక్షల వరకు భారీ పీనల్టీ విధించడమే కాకుండా, నటులు ఎలాంటి కొత్త ఉత్పత్తులను లేదా బ్రాండ్లను ప్రమోట్ చేయకుండా దాదాపు మూడేళ్ల వరకు నిషేధం విధించే ప్రతిపాదన కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రకటనల్లో నటిస్తున్నప్పుడు సెలబ్రిటీలకు ఉండే సామాజిక బాధ్యతను గుర్తుచేసేలా ఈ చర్యలు ఉంటాయని ఎఫ్‌డీఏ ప్రతినిధులు తెలిపారు.

గతంలో 2022లో బాలీవుడ్ స్టార్ నటుడు అక్షయ్ కుమార్ కూడా షారుఖ్ ఖాన్, అజయ్ దేవగణ్‌లతో కలసి ఇదే విమల్ ఇలాచీ ప్రకటనలో నటించారు. ఈ ప్రచారం టీవీల్లో, సోషల్ మీడియాలో ప్రసారం కావడంతో ఆయన అభిమానులు, సాధారణ ప్రజల నుండి తీవ్ర స్థాయి వ్యతిరేకత ఎదురైంది. ప్రజల ఆగ్రహాన్ని గుర్తించిన అక్షయ్ కుమార్ వెంటనే బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. భవిష్యత్తులో పొగాకు సంబంధిత బ్రాండ్ల ప్రకటనల్లో నటించబోనని స్పష్టం చేస్తూ ఆ బ్రాండ్ ప్రచారం నుండి తప్పుకున్నారు. అంతేకాకుండా ఆ ప్రకటన ద్వారా తనకు వచ్చిన పారితోషికం మొత్తాన్ని మంచి సామాజిక కార్యక్రమానికి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా, పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే ఆరోగ్య నష్టాలను నివారించేందుకు దేశంలో పలు ఇతర రాష్ట్రాలు కూడా కఠినమైన నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నాయి. పొగాకు, గుట్కా, పాన్ మసాలా మరియు నికోటిన్ కలిగిన ఇతర నిషేధిత ఉత్పత్తుల విక్రయాలపై కర్ణాటక ప్రభుత్వం ఇటీవల కఠిన చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్రవ్యాప్తంగా వీటి తయారీ, నిల్వ, రవాణా, పంపిణీ మరియు విక్రయాలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్2006' నిబంధనల ప్రకారం ప్రజారోగ్యానికే ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రత్యేక బృందాలతో దాడులు నిర్వహిస్తున్నామని తెలిపింది. మరోవైపు ఒడిశా ప్రభుత్వం కూడా పొగాకు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నికోటిన్ కలిగిన ఉత్పత్తులపై నిషేధం విధించింది. గుట్కా, పాన్ మసాలా, జర్దా, ఖైనీ వంటి ఉత్పత్తుల తయారీ, విక్రయాలు, నిల్వ మరియు రవాణాను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో నిర్వహిస్తున్న నివేదికల ప్రకారం దాదాపు 42 శాతానికి పైగా పౌరులు సిగరెటేతర పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్నట్లు తేలింది. ఈ ఆందోళనకర పరిస్థితుల దృష్ట్యా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఇటీవల విడుదల చేసిన సమగ్ర నివేదిక ప్రకారం దేశంలో పొగాకు వినియోగం వేగంగా విస్తరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో దీని ప్రభావం చాలా ఎక్కువగా ఉన్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. సాధారణంగా భావించే దానికి భిన్నంగా, గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లోనే పొగాకు ఉత్పత్తుల వాడకం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. గత దశాబ్ద కాలంలో దేశంలో పొగాకు వినియోగం ఏకంగా 34 శాతం మేర పెరగడం, ఇది అన్ని ప్రాంతాలకు వేగంగా వ్యాపించడం పట్ల ఆరోగ్య నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల కట్టడికి టీజీ సేఫ్

**మొదటిపేజీ తరువాయి**

సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. ఆహార పదార్థాల నాణ్యత, మందుల విక్రయాలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు వీలుగా "తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్" పేరుతో నూతన ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు వేర్వేరుగా పనిచేస్తున్న ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ), డ్రగ్స్ కంట్రోల్ విభాగాలు రెండింటినీ విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక మార్పుకు శ్రీకారం చుట్టింది.

ఈ కొత్త ఏకీకృత వ్యవస్థ రాకతో ఇకపై ఆహారం, ఔషధాలు, కాస్మెటిక్స్ (సౌందర్య ఉత్పత్తులు) వ్యాపారాలకు సంబంధించిన లైసెన్సుల జారీ, క్షేత్రస్థాయి తనిఖీలు, శాంపిళ్ల సేకరణ, ల్యాబ్ పరీక్షలు మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు అన్నీ ఒకే పరిపాలనా పరిధిలోకి రానున్నాయి. దీనివల్ల నిఘా వ్యవస్థ మరింత వేగవంతం అవ్వడమే కాకుండా, కల్తీ రాయుళ్లపై కఠిన చర్యలు తీసుకోవడానికి అధికారులకు పూర్తి అధికారాలు దక్కనున్నాయి. విడివిడిగా ఉన్న విభాగాలు ఒకే మాటపై పనిచేయడం వల్ల పాలనాపరమైన జాప్యం తప్పుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా తెలంగాణ వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ జీవో ఎంఎస్ నంబర్ 67ను అధికారికంగా జారీ చేసింది. ఈ నూతన వ్యవస్థ ఉత్తర్వులు ఆగస్టు 15, 2026 నుంచే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, వినియోగదారులకు నాణ్యమైన ఆహారం, సురక్షితమైన మందులు అందేలా చూడటమే ఈ టీజీ సేఫ్ ముఖ్య ఉద్దేశమని ఆ జీవోలో స్పష్టం చేశారు.

ఈ నూతన ప్రాధికార సంస్థ పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అనుభవజ్ఞుడైన అధికారికి అప్పగించింది. టీజీ సేఫ్ తొలి కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మొహంతిని నియమిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఆయన డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు ఆయనకు టీజీ సేఫ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ, ఫుడ్ సేఫ్టీ మరియు డ్రగ్స్ కంట్రోల్ రెండు విభాగాల పూర్తి పరిపాలనా నియంత్రణను ఆయన చేతిలోనే ఉంచింది.

పరిపాలనా సౌలభ్యం కోసం టీజీ సేఫ్ అంతర్గతంగా ఆరు ప్రత్యేక విభాగాలుగా పనిచేయనుంది. ఇందులో డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ & ప్రాసిక్యూషన్, ల్యాబొరేటరీ మరియు అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు ఉంటాయి. ఇప్పటివరకు విడివిడిగా ఉన్న ఫుడ్ సేఫ్టీ టెస్టింగ్ ల్యాబ్‌లు, డ్రగ్స్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఇకపై ఒకే 'ల్యాబొరేటరీ విభాగం' కిందకు తీసుకువచ్చి అత్యాధునిక సాంకేతికతతో నడిపించనున్నారు.

ఈ కొత్త వ్యవస్థ తన క్షేత్రస్థాయి కార్యకలాపాలను తొలిదశలో 'క్యూర్' ప్రాంతంలో ప్రారంభించనుంది. రాష్ట్రంలో ఆహార వ్యాపారాలు, ఔషధ తయారీ మరియు విక్రయ సంస్థలు ఈ ప్రాంతంలోనే అత్యధికంగా కేంద్రీకృతమై ఉన్నాయి. అందువల్ల ఇక్కడ ముందస్తుగా కఠిన నిఘా ఏర్పాటు చేస్తే ఎక్కువ ఫలితం ఉంటుందని ప్రభుత్వం భావించి ఈ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. ఇక్కడి అనుభవాల ఆధారంగా తదనంతరం రాష్ట్రవ్యాప్తంగా టీజీ సేఫ్ కార్యకలాపాలను పూర్తి స్థాయిలో విస్తరిస్తారు.

మార్కెట్లో జరిగే అక్రమాలు, కల్తీలను అడ్డుకోవడానికి టీజీ సేఫ్ సరికొత్తగా 'ఇంటెలిజెన్స్' మరియు 'రిస్క్ ఆధారిత తనిఖీల' విధానాన్ని అవలంబించనుంది. క్షేత్రస్థాయిలో దాడులు, తనిఖీలు సమర్థవంతంగా నిర్వహించడానికి వీలుగా టీజీ సేఫ్‌కు తగినంత మంది పోలీస్ సిబ్బందిని కేటాయించాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ని ప్రభుత్వం ఆదేశించింది. దీనివల్ల శాంతిభద్రతల సహకారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు వేగంగా చర్యలు తీసుకోగలుగుతాయి.

చివరగా, రాష్ట్రంలో ఫుడ్, డ్రగ్స్ నియంత్రణ వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించడానికి ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేయనుంది. ఈ కమిటీ ఆధునిక టెస్టింగ్ విధానాలు, నిఘా వ్యవస్థ బలోపేతం, డేటా అనాలిసిస్, చట్టపరమైన మద్దతు మరియు ల్యాబొరేటరీలలో మౌలిక వసతుల పెంపుదల వంటి అంశాలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. మొత్తానికి టీజీ సేఫ్ రాకతో రాష్ట్రంలో కల్తీ వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తడం ఖాయంగా కనిపిస్తోంది.

## సర్పంచ్, సెక్రటరీల మధ్య వివాదం..... ఇరువర్గాలపై కేసులు నమోదు

- **సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ వర్గాల పరస్పర దాడులు**
- **పోలీస్ స్టేషన్ లో పరస్పరం ఒకరి పై ఒకరు పరస్పర ఫిర్యాదులు**
- **క్రైమ్ నెంబర్ 152/2026 లో 121(1), 132, 351(2) రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్**
- **క్రైమ్ నెంబర్ 153/2026 లో 118(1), 351(2), 352 రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ సెక్షన్ల కిందా కేసు నమోదు**
- **వివరాలు వెల్లడించిన పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్**

**పెద్దేముల్,ఆగష్టు 16(సిరి న్యూస్):**

పెద్దేముల్ మండల పరిధిలోని కందెనెల్లి తండా సర్పంచ్ రాథోడ్ ఆనంద్ నాయక్, ఆయన కుమారుడు నితీష్,పంచాయతీ సెక్రటరీల మధ్య జరిగిన ఘర్షణ ఉద్రిక్తతకు దారితీసింది.స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విధి నిర్వహణ సమయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని, అనంతరం పరస్పరం దాడులకు పాల్పడినట్లు సమాచారం.

**ఎంపీడీఓ కార్యాలయంలో చోటు చేసుకున్న ఘర్షణ**

విధి నిర్వహణలో ఉన్న సమయంలో సర్పంచ్ రాథోడ్ ఆనంద్ నాయక్, పంచాయతీ సెక్రటరీలు మల్లేష్, కే.నవిత ల మధ్య వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది.మాటామాటా పెరగడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు సమాచారం.ఈ ఘటనతో ఎంపీడీఓ కార్యాలయం లోపల కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**పోలీస్ స్టేషన్ లో ఇరువర్గాల ఫిర్యాదులు**

ఘటన అనంతరం ఇరువర్గాలు అదే రోజు పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**సెక్రటరీ ఫిర్యాదుతో సర్పంచ్, ఆయన కుమారుడు పై కేసు**

పంచాయతీ సెక్రటరీ మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కందెనెల్లి తండా సర్పంచ్ ఆనంద్ నాయక్, ఆయన కుమారుడు నితీష్ కుమార్‌లపై పోలీసులు క్రైమ్ నెంబర్ 152/2026 లో 121(1), 132, 351(2) రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ సెక్షన్ ల కిందా కేసు నమోదు చేసినట్లు పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

**సర్పంచ్ ఫిర్యాదుతో ఇద్దరు సెక్రటరీలపై కేసు**

అదేవిధంగా సర్పంచ్ ఆనంద్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచాయతీ సెక్రటరీలు మల్లేశం, కే.నవితలపై కూడా క్రైమ్ నెంబర్ 153/2026 లో 118(1), 351(2), 352 రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ సెక్షన్ ల కిందా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు

**దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

ఇరువర్గాల ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేసిన పోలీసులు ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ఘర్షణకు దారితీసిన కారణాలు, ఘటనలో ఎవరి పాత్ర ఎంతమేర ఉందనే అంశాలపై



## కాంగ్రెస్ నాయకుడు కరిష ఏసు కన్నుమూత

**అనంతగిరి ఆగస్టు 16(సిరి న్యూస్):**

మండల పరిధిలోని శాంతినగర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కరిష ఏసు (60) అనారోగ్యంతో కన్నుమూశారు.గత నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ చురుకైన కార్యకర్తగా పార్టీకి విశేష సేవలు అందించారు.1981లో శాంతినగర్ గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ గా ఎన్నికయ్యారు.అనంతరం 2006లో శాంతినగర్ గ్రామ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టి 6 సంవత్సరాల పాటు గ్రామ ప్రజలకు సేవలు అందించారు.గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారు.ఆయన మృతి పట్ల శాంతినగర్ గ్రామ కాంగ్రెస్ కమిటీ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఆయన సేవలను కొనియాడుతూ అశ్రు



నయనాలతో శ్రద్ధాంజలి ఘటించారు.నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన కరిష ఏసు మృతి పార్టీకి తీరని లోటని,ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.

## దుద్యాలలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఏర్పాటు

**వికారాబాద్ జిల్లా ఆగస్టు 16(సిరి న్యూస్):**

దుద్యాల ఎమ్మార్పీఎస్ దుద్యాల మండల నూతన కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. మండల ఇన్‌చార్జి గజ్జల ప్రవీణ్ ప్రకాష్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి గట్టగల ప్రశాంత్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా జోగు వెంకట్ రాములు మాదిగ, అధికార ప్రతినిధిగా నరేష్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా నేరటి సాయి కుమార్, ప్రధాన కార్యదర్శిగా కశ్యగారి అశోక్ మాదిగ, కార్యదర్శిగా సిరికుమార్ మాదిగలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాదిగ మాట్లాడుతూ.. మత దురహంకారం, కుల వివక్ష, సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాలుగా చేసిన పోరాటం ఫలితంగా వర్గీకరణ ఫలాలు 59 కులాలకు అందుతున్నాయని తెలిపారు. మాదిగలు విద్య, ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణించాలని సూచించారు. అట్టడుగు వర్గాల సమస్యల పరిష్కారంలో ఎమ్మార్పీఎస్ నాయకత్వం బాధ్యత తీసుకోవాలని, మాదిగలకు అన్యాయం జరిగిన ప్రతిసారీ గళం విప్పాలని అన్నారు. నూతన తరాన్ని ఉద్యమంలోకి తీసుకొచ్చి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఉద్యమాన్ని బలోపేతం చేయాలని కోరారు. సెప్టెంబరు 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్-ఎంఎస్పీ జాతీయ మహాసభకు వికారాబాద్ జిల్లా నుంచి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొండ అశోక్ మాదిగ, యలాల్ మండల మాజీ అధ్యక్షుడు సూర్యప్రకాశ్ మాదిగ, అంజి మాదిగ, నరేష్ మాదిగ, అనిల్ మాదిగ, కృష్ణ మాదిగ, సిరికుమార్, సాయి మాదిగ, మొగులప్ప, అశోక్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



## సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ నూతన కార్యవర్గం ఎన్నిక



పటాన్ చెరు, ఆగస్టు 16, (సిరి న్యూస్)

తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు, తెలంగాణ రాష్ట్ర ఓబిసి అధ్యక్షుడు ఆనంద్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సహకారంతో సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ నూతన కార్యవర్గాన్ని సంగారెడ్డి జిల్లా ఓబీసీ అధ్యక్షులు కోణం విఠల్ ఆదివారం ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులుగా ఎన్ అశోక్. పి సంగాకర్, గొల్ల ఆంజనేయులు, ఆర్ శివ చందర్, అంబదాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా కే శ్రీనివాస్, బి మల్లేశం, జిల్లా కార్యదర్శులుగా సందీప్ గౌడ్, రాజ్ కుమార్, పగిడి మర్రి శ్రీకాంత్, జి రమేష్, ఎం. మారయ్య, సోషల్ మీడియా కన్వీనర్ గా ఆర్. మల్లేశం, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు గా కే శ్రీశైలం, జె. సతీష్ గౌడ్, వి.రాములు, కె. సిద్దిరాములు, శివరాజ్, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంగారెడ్డి జిల్లాలో భారతీయ జనతా పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

## సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయం

### పెద్ద కంజర్లలో వీధి దీపాలు ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్.



పటాన్ చెరు, ఆగస్టు 16, (సిరి న్యూస్):

గ్రామ అభివృద్ధికి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని పెద్ద కంజర్ల గ్రామంలో రెండవ వార్డ్ కౌన్సిలర్ సారా లావణ్య లక్ష్మణ్ ఆధ్వర్యంలో మూడు లక్షల రూపాయల సొంత నిధులతో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ దీపాలు, స్తంభాలను శనివారం రాత్రి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డు అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తూ.. అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళుతున్నామని తెలిపారు. ప్రధానంగా మౌలిక వసతుల కల్పన కు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సొంత నిధులతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఊర్మిల వెంకటరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు నసీమా బేగం నవాబ్, సల్మాన్, సీనియర్ నాయకులు రామచందర్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయాలి

- మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్
- దోమడుగులో 16 జట్లతో క్రీడా సంబరం
- 50కి పైగా మ్యాచ్ లతో దోమడుగు ప్రీమియర్ లీగ్ కు సన్నాహాలు



గుమ్మడిదల ఆగస్టు 16 ( సిరి న్యూస్):

గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ అన్నారు. గ్రామ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించే లక్ష్యంతో గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో ప్రీమియర్ లీగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పోటీల్లో మొత్తం 16 జట్లు పాల్గొననుండగా, 50కి పైగా క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలోని యువత తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ పోటీలు చక్కటి వేదికగా నిలవనున్నాయి. పోటీల ద్వారా యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు గ్రామంలో ఐక్యత, స్నేహభావం, క్రీడా స్ఫూర్తిని మరింత బలోపేతం చేయడమే ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్లు రాజశేఖర్, రాజిరెడ్డి, నాయకుడు శేఖర్ రెడ్డి, పన్నులు శ్రీను, వెంకట్రాం రెడ్డి, సీహెచ్ బద్రయ్య, ఏ. భాస్కర్ రెడ్డి, ఎం. శ్రీనివాస్ రెడ్డి, ఏ. రాజు, సీనియర్ నాయకులు, దోమడుగు గ్రామ యువత, క్రీడాభిమానులు పాల్గొంటున్నారు.

## అభివృద్ధిలో రామ్ రెడ్డిబావిని ముందుకు తీసుకపోవడమే లక్ష్యం

- సర్పంచ్ సామల మైపాల్ రెడ్డి
- రామ్‌రెడ్డిబావిలో సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన
- రూ.15 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో అభివృద్ధి పనులు

గుమ్మడిదల, ఆగస్టు 16 (సిరి న్యూస్ ):



గ్రామంలో మౌలిక వసతులను మెరుగు పరిచే లక్ష్యంతో రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్లు రామ్ రెడ్డి బావి గ్రామ సర్పంచ్ సామల మైపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మండల పరిధిలోని రామ్‌రెడ్డిబావి గ్రామపంచాయతీలో రూ.15 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మైపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రాధాన్య తనిస్తూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుంటున్నామని అన్నారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. సిమెంట్ రోడ్డు నిర్మాణంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగి, రహదారి సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల విషయంలో నాణ్యతకు ఎక్కడా రాజీ పడకుండా, పనులను నిర్ణీత ప్రమాణాల మేరకు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో రామ్‌రెడ్డిబావిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జహీందర్‌రెడ్డి, వార్డు సభ్యులు కృష్ణ గౌడ్, అభిలాష్ గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ సామల దయాకర్‌రెడ్డి, గ్రామ పెద్దలు మల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రారెడ్డి, రాజిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సురేందర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, యూత్ సభ్యులు హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణమాసంలో భక్తులతో కిటకిటలాడిన వీరభద్రస్వామి ఆలయం





- ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భద్రకాళి అమ్మవారికి కుంకుమార్చనలు
- భక్తులకు నిత్య అన్నదాన ప్రసాదం ఏర్పాటు

గుమ్మడిదల, ఆగస్టు 16 (సిరి న్యూస్ ):

శ్రావణమాసం ఆదివారం సందర్భంగా భద్రకాళి సహిత వీరభద్రస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి వీరభద్రస్వామివారిని, భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. శ్రావణమాసం సందర్భంగా శైవ క్షేత్రాల్లో విశిష్టమైనదిగా పేరుగాంచిన శ్రీ భద్రకాళి సహిత వీరభద్రస్వామి ఆలయంలో నెలరోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, బిల్వార్చన తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భద్రకాళి అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన పూజలను మహిళలు చేశారు. వీరభద్ర స్వామిని తమ కులదైవంగా భావించే భక్తులు ప్రత్యేకంగా ఆలయానికి చేరుకుని స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారి, అమ్మవారి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణమాసం సందర్భంగా నెలరోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతుండటంతో ప్రతిరోజూ భక్తుల రాక పెరుగుతోంది.

### సత్యనారాయణ స్వామి వ్రతాలు

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలోని సత్య నారాయణ స్వామి మండపంలో భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులందరికీ అన్నప్రసాదం అందించి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

### భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆలయ కమిటీ కార్యనిర్వహణాధికారి రామబ్రహ్మచారి మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆలయ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. శ్రావణమాసం నెలరోజుల పాటు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి వీరభద్రస్వామివారి, భద్రకాళి అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని ఆయన కోరారు. ముఖ్యంగా బిల్వార్చన పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని సూచించారు.

# ఆరోగ్య రక్షణగా నిలుస్తాం






- టీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం.
- మహిళల ఆరోగ్య రక్షణే టిఆర్ఎస్ ధ్యేయం.
- ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు వెలుతాం.
- తెలంగాణా రక్షణ సేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బట్టి అజయ్.

మెదక్ఆగస్టు16,(సిరి న్యూస్)

మహిళల ఆరోగ్య రక్షణ ధ్యేయంగా ముందుకు వెళ్తామని తెలంగాణ రక్షణ సేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బట్టి అజయ్ పేర్కొన్నారు. ఆదివారం మెదక్ పట్టణం పిల్లికోటాల్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలోని బస్తీ దావఖానలో సింధు హాస్పిటల్స్, హైటెక్ సిటీ, హైదరాబాద్ వారి సహకారంతో మహిళల కోసం ప్రత్యేక ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని బట్టి అజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఖరీదైన వైద్య పరీక్షలు చేయించుకోలేని పేద, మధ్యతరగతి కుటుంబాల మహిళలకు ఇలాంటి ఉచిత వైద్య సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటా యన్నారు. ఈ శిబిరంలో ఒక్కో మహిళకు సుమారు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు విలువైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించామని తెలిపారు.ముఖ్యంగా చెస్ట్ ఎక్స్‌రే, మామోగ్రామ్‌తో పాటు మహిళలకు సంబంధించిన వివిధ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ నిర్ధారణ అయిన మహిళలకు సింధు హాస్పిటల్స్‌లో ఉచితంగా సర్జరీలు, చికిత్స అందించే కార్యక్రమాన్ని చేపడుతమని సూచించారు. ముందు మున్ముందు పేద ప్రజల ఆరోగ్య దృష్ట్యా మరిన్ని ఆరోగ్య సేవలు ఉచితంగా ఏర్పాటు చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ సీనియర్ నాయకులు ఇప్పా రమేష్, నందకిశోర్, కాసాపురం అశోక్, జంగం నాగరాజు, వేపూరి శ్రీనివాస్, ప్రేమ్, మధు కార్తీక్, ముహమ్మద్ సమీర్, జుబేర్, సాయి, రిజ్వాన్, చంద్రపాల్,సింధు హాస్పిటల్స్ యాజమాన్యం, స్పెషలిస్ట్ వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు శిబిరంలో పాల్గొని మహిళలకు ఉచిత వైద్య సేవలు అందించారు.



# నేడు చల్మెడ గ్రామంలో మాజీ సర్పంచ్ నక్సలైట్ ఉద్యమనేత నర్సింహారెడ్డి అంత్యక్రియలు.

### గుండెపోటుతో కన్నుమూత....

**రామాయంపేట, ఆగస్టు 16 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని చెల్మెడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్,నక్సలైట్ ఉద్యమ నేత నరసింహారెడ్డి శనివారం సాయంత్రం గుండెపోటుతో మరణించిన సంగతి పాఠకు తెలిసిందే. అయితే ఆయన అంత్యక్రియలు సోమవారం నాడు జరగనున్నాయి. నిజాంపేట మండలం చలిమెడ గ్రామ సర్పంచ్ గా పనిచేసిన సమయంలోనే గ్రామాన్ని సంక్షేమం అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు పార్టీలక తీతంగా ఆయన విశేషంగా కృషి చేశారు. ఆయన మృతి పట్ల గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి. నరసింహారెడ్డి మరణ వార్తను గ్రామ ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా తాను ముందుండి అనేక పనులు చేయించి ప్రజల గుండెల్లో నిలిచిపోయాడు. ఉద్యమ నేత నుంచి ప్రజా ప్రతినిధి వరకు ఆయన ప్రస్థానం నెలకొంది. 1989లో పీపుల్స్ వార్ ఉద్యమానికి ఆకర్షితులై పీపుల్స్ వారి



పార్టీలో మిలిటెంట్ గా ప్రస్థానం చేపట్టిన నరసింహారెడ్డి అనతి కాలంలోనే రాడికల్ యూత్ లీగ్ ప్రాంతీయ కార్యదర్శి గాను పీపుల్స్ వార్ ఉపదల కమాండర్ గాను పనిచేస్తూ పీడిత తాడిత బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతూ ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించారు.పీపుల్స్ వార్ లో అప్పటి అగ్రనేతలు హరిబుషన్, జిల్లా కార్యదర్శిగా ఉన్న పాపన్నల తో మంచి సంబంధాలు కొనసాగించి ఉద్యమంలో పనిచేశారు. అదే స్ఫూర్తి తో తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేశారు. మహిళ సంఘాల అభివృద్ధి కోసం మహిళా సంఘం లో పనిచేస్తున్న చల్మెడ గ్రామానికి చెందిన కవితక్కను ఆదర్శ వివాహం చేసుకున్నాడు. తదనంతరం పోలీసులకు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసి చల్మెడ గ్రామంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా వారి అవసరాలు తీరుస్తూ ప్రజామన్నలను పొంది బి ఆర్ ఎస్ పార్టీలో చేరి చల్మెడ గ్రామ సర్పంచ్ గా గెల్పొంది చల్మెడ గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాడు. గత ఆరు నెలల క్రితం జరిగిన సర్పంచ్ ఎన్నికలలో రిజర్వేషన్లు కలిసి రాక మరల సర్పంచ్ గా పోటీ చేయలేక పోయాడు.ప్రజల మధ్యలోనే ఉంటూ ప్రజా కార్యక్రమాలు కొనసాగించాడు. తన సహచరిని కవితక్క అనారోగ్యంతో పది సంవత్సరాల క్రితమే చనిపోయినప్పటికీ తన ఇద్దరు కూతుళ్లు వెన్నెల మానస లను ఉన్నత చదువులు చదివిస్తూ ప్రజాసేవ చేస్తూ ప్రజల మన్నలను పొందాడు. టిడిపి పార్టీలో సీనియర్ నాయకుడు చల్మెడ గ్రామం మాజీ సర్పంచ్, డిసిసిబి డైరెక్టర్, నందిగామ సింగిల్ విండో చైర్మన్ గా పనిచేసిన ముత్యంరెడ్డి కి నరసింహారెడ్డి స్వయాన సోదరుడు నరసింహారెడ్డి మృతితో చల్మడ గ్రామ ప్రజలతోపాటు నిజాంపేట మండల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

#### పలువురి సంతాపం

నరసింహారెడ్డి మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మెదక్ మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, పద్మాదేవేందర్ రెడ్డి, పి.శశిదరరెడ్డి మాజీ ఎమ్మెల్సీ షేరీ సుభాష్ రెడ్డి,డీసీసీబీ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి. నియోజకవర్గ టి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జీ కాంటారెడ్డి తిరుపతిరెడ్డి, టి యు డబ్ల్యూ జె (iju)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.జి.శ్రీనివాస శర్మ, రామాయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బసన్నపల్లి మల్లేశం యాదవ్, ప్రధాన కార్యదర్శి పటేరి రాము. జిల్లా కోశాధికారి ఊడెం దేవరాజు, పాతూరు రమేష్ గౌడ్ లు సంతాపం సంతాపం వ్యక్తం చేశారు.

# ఉస్మాన్‌నగర్‌లో ఘనంగా ఆరోగ్య అవగాహన రన్..

- **500 మందికి పైగా స్థానికుల ఉత్సాహభరిత భాగస్వామ్యం**
- **జెండా ఊపి ప్రారంభించిన రమణ ఈశ్వరగారి**

**రామచంద్రపురం, ఆగస్టు 16 (సిరి న్యూస్) :**

ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నిత్య వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని TeNA అధ్యక్షుడు రమణ ఈశ్వరగారి అన్నారు. ఆరోగ్య అవగాహన, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల్లో క్రమం



తప్పకుండా వ్యాయామం చేసే అలవాటును ప్రోత్సహించేందుకు హైదరాబాద్ రన్నర్స్, ముప్పా ఇంద్రప్రస్థ రన్నర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉస్మాన్‌నగర్‌లో 24కే, 8కే, 5కే రన్ నిర్వహించారు. ఈ రన్‌ను రమణ ఈశ్వరగారి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో 500 మందికి పైగా స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వయసుల వారు శారీరకంగా చురుకుగా ఉండేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. రన్‌ను విజయవంతం చేయడంలో భాగస్వాములైన పాల్గొనేవారు, వాలంటీర్లు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మెదక్ ను చార్మినార్ జోన్‌లో చేర్చాలి

- **విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం చేయాలి**
- **అక్కన్నపేట మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ వెలుముల సిద్ధరాములు**

**రామాయంపేట, ఆగస్టు 16 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లాను ప్రస్తుతం ఉన్న రాజన్న సిరిసిల్ల జోన్ నుంచి తొలగించి చార్మినార్ జోన్‌లో చేర్చాలని అక్కన్నపేట మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ వెలుముల సిద్ధరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్సీ అంజిరెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. మెదక్ జిల్లా ఆర్థికంగా, పారిశ్రామికంగా, విద్యాపరంగా చుట్టుపక్కల జిల్లాలతో పోలిస్తే ఎంతో వెనుకబడి ఉందని సిద్ధరాములు పేర్కొన్నారు. నిజాం కాలం నుంచి వ్యవసాయంపై ఆధారపడిన మెతుకు సీమ.. నేటికీ వ్యవసాయంపైనే ఎక్కువగా ఆధారపడుతోందన్నారు. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలతో పోలిస్తే మెదక్‌లో పారిశ్రామిక అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని తెలిపారు. విద్యారంగంలోనూ జిల్లా వెనుకబాటుతనం స్పష్టంగా కనిపిస్తోందని, ప్రతి ఏడాది పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో మెదక్ జిల్లా వెనుకబడుతుండటమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు కూడా ఇతర జిల్లాలతో పోలిస్తే తక్కువగా ఉండటంతో పాటు, ఉన్న కళాశాలల్లో పూర్తిస్థాయి వసతులు లేకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా బలమైన ప్రాతినిధ్యం లేకపోవడంతో గతంలో మెదక్ జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్‌లో చేర్చిన సమయంలో ఎవరూ సరైన స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయలేదని



సిద్ధరాములు అన్నారు. ప్రస్తుతం అదే నిర్ణయం భవిష్యత్తులో మెదక్ విద్యార్థులు, నిరుద్యోగులకు తీవ్ర నష్టం కలిగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.రాజన్న సిరిసిల్ల జోన్‌లోనే కొనసాగితే ఉద్యోగాల కోసం కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల వంటి విద్యాపరంగా ముందున్న జిల్లాల విద్యార్థులతో మెదక్ యువత పోటీ పడాల్సి వస్తుందని తెలిపారు. దీని వల్ల మెదక్ నిరుద్యోగులకు ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించడం మరింత కష్టతరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో గెజిటెడ్ స్థాయి ఉద్యోగాలు సాధించినా మెదక్‌కు సమీపంలోని హైదరాబాద్ ప్రాంతాల్లో కాకుండా దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి రావచ్చని అన్నారు.గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఇప్పటికైనా సరిదిద్దాలని, మెదక్ జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్ నుంచి తొలగించి చార్మినార్ జోన్‌లో చేర్చాలని సిద్ధరాములు కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని విద్యార్థులు, నిరుద్యోగుల ఆకాంక్షను నెరవేర్చేందుకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఓదెలు వర్ధంతికి నాతరి స్వామి నివాళి..

- **ప్రథమ వర్ధంతికి కాంగ్రెస్ నేతల హాజరు..**
- **ఓదెలు సేవలను స్మరించిన నేతలు..**
- **కుటుంబానికి అండగా కాంగ్రెస్ శ్రేణులు..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 (సిరి న్యూస్)**

బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కన్నూరి వెంకటేష్ తండ్రి, కీర్తిశేషులు కన్నూరి ఓదెలు ప్రథమ వర్ధంతి కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా



కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, న్యాయవా దులు, పార్టీ శ్రేణులు హాజరై కన్నూరి ఓదెలు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కన్నూరి ఓదెలు కుటుంబానికి, బంధుమిత్రులకు, పరిచయస్తులకు అందించిన సేవలు, ఆయనతో తమకున్న అనుబంధాన్ని నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను కుటుంబ సభ్యులు కొనసాగించాలని ఆకాంక్షించారు. వర్ధంతి కార్యక్రమానికి పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరై కుటుంబానికి అండగా నిలిచారు. కార్యక్రమంలో బెల్లంపల్లి మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ మునిమంద రమేష్, రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు నాతరి స్వామి, సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిప్ప మనోహర్, న్యాయవాది సబ్బని సాయి కుమార్, 26వ వార్డు కౌన్సిలర్ ఇప్ప కుమారస్వామి, 15వ వార్డు కౌన్సిలర్ చింతల వసంత, తాండూర్ నాయకులు పేరం శ్రీనివాస్, నాయకులు సునీల్, శ్రీనివాస్ పాల్గొని కన్నూరి ఓదెలుకు నివాళులర్పించారు.

## నియామకం పట్ల హర్షం

**పటాన్ చెరు, ఆగస్టు 16, (సిరి న్యూస్):**



సంగారెడ్డి జిల్లా ఓ బి సీ మోర్చా ఉపాధ్యక్షుడిగా నల్లగండ్ల అశోక్ కుమార్ నియామకం అయ్యారు. ఆయన నియామకం పట్ల బిజేపి మున్సిపల్ అధ్యక్షులు మద్దూరి రాజు హర్షం వ్యక్తం చేశారు. గడ్డపోతారం మున్సిపాలిటీకి చెందిన బిజేపి సీనియర్ నాయకులు నల్లగండ్ల అశోక్ కుమార్ భారతీయ జనతా పార్టీ జిల్లా ఓ బి సి మోర్చా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన నియామకం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, నల్లగండ్ల అశోక్ కుమార్ గారి నాయకత్వంలో జిల్లాలో ఓ బి సీ మోర్చా మరింత బలోపేతం అవుతుందని మద్దూరి రాజు ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి, వెనుకబడిన వర్గాల హక్కుల సాధనకు ఆయన నిరంతరం కృషి చేయాలని కోరుతూ అభినందనలు తెలిపారు.

## దేవాలయాల నిర్మాణం కోసం సంపూర్ణ సహకారం



**పటాన్ చెరు, ఆగస్టు 16, (సిరి న్యూస్);**

నియోజకవర్గ పరిధిలో దేవాలయాల నిర్మాణం కోసం సంపూర్ణ సహకారం అంద జేస్తున్నట్లు స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీ, ఇంద్రపురి కాలనీలలో నూతనంగా నిర్మించిన దేవాలయాలలో ఆయన ఆదివారం శ్రీశ్రీశ్రీ దుర్గా మాత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆలయాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. ప్రజలలో భక్తి భావం పెంపొందించడంలో నూతన ఆలయాల నిర్మాణాలు ఎంత గానో దోహదపడతాయని అన్నారు. ఈ కార్య క్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు అంతిరెడ్డి, రమేష్ నాయక్, రమేష్, సీనియర్ నాయకులు పృథ్వీరాజ్, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

### మండల స్థాయిలో సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం



**గుమ్మడిదల, ఆగస్టు 16 (సిరి న్యూస్):**

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం ఈనెల 17వ తేదీ నుండి మండల అభివృద్ధి కార్యాలయంలో ప్రారంభం కానుంది. ప్రతి సోమవారం ఈ ప్రజావాణి కార్యక్రమం ఉంటుంది. గుమ్మడిదల మండల కేంద్రంతో పాటు గుమ్మడిదల పురపాలక సంఘాన్ని కలుపుకొని మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మండల అభివృద్ధి అధికారి అధ్యక్షతన ఈ కార్యక్రమం కొనసాగనుంది. మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందేందుకు వీలుగా ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను ఆర్జీల రూపంలో సమర్పించి, వాటి పరిష్కారానికి అధికారులను సంప్రదించాలని ఆమె కోరారు. ప్రజల నుంచి స్వీకరించిన ఆర్జీలను పరిశీలించి సంబంధిత శాఖల అధికారుల ద్వారా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 16(డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం కామారెడ్డి జిల్లా బిచ్కుందకు విచ్చేశారు. జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతారావు కుమార్తె వివాహ విందు కార్యక్రమానికి హాజరయ్యేందుకు బిచ్కుందకు చేరుకున్న ముఖ్యమంత్రిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్యమంత్రితో మర్యాదపూర్వకంగా చర్చించారు.జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వన దుర్గా మాత సన్నిధిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



**పెద్ద శంకరం పేట, ఆగస్టు 16, (సిరి న్యూస్):**

మండల పరిధి లోని ముసాపేట గ్రామంలో 2008-09 లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఏడుపాయల వన దుర్గామాత, సన్నిధిలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. నాడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు జీ గోపాల్ రెడ్డి, శంకర్, గోపాల్, వసుమతి, వి. సాయిలు, విద్యార్థులు క్రిష్ణ, కేశవులు, నర్సింలు, అల్లమయ్య, మహేందర్, భూమేష్, రేణుక, సుష్మిత, మొదలగు 30మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాటి ప్రధానోపాధ్యాయులు శేఖర్ గౌడ్, గణిత ఉపాధ్యాయులు స్వామి, తోటి విద్యార్థులు సాయిలు, సహేందర్ లు తమ మధ్య లేనందున వారికి నివాళులు అర్పించారు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగింది.

## శ్రావణమాసంలో మంబాపూర్ లో బోనాల సందడి






**గుమ్మడిదల, ఆగస్టు 16 (సిరి న్యూస్ ):**

గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో శ్రావణమాసం సందర్భంగా ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోచమ్మ పండుగ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు తలపై బోనాలను ధరించి ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



# పార్కు కోసం పిల్లల పోరుబాట!..

- **మా ఆటస్థలం మాకు కావాలి అంటూ చిన్నారుల ధర్నా..**
- **పార్కు స్థలం అమ్మొద్దు అంటూ రేవంత్ రెడ్డికి వేడుకోలు..**
- **మేము ఆడుకోవడానికి స్థలం ఎక్కడ? అంటూ పిల్లల ప్రశ్న..**
- **ధర్నాకు ఎమ్మెల్యే కృష్ణారావు, బీఆర్ ఎస్ నేతల మద్దతు..**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 16 ( సిరి న్యూస్ ):**

పార్క్ కావాలి..పార్క్ కావాలి.. మా ఆటస్థలం మాకు కావాలి! అంటూ చిన్నారులు నినదించారు. తమ ఆటల కోసం కేటాయించిన పార్కు స్థలాన్ని ప్రభుత్వం విక్రయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ శేర్లింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్ లో ఉన్న మిత్ర హిల్స్‌లో చిన్నారులు చేపట్టిన ధర్నా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని చిన్నారులు ధర్నాలో పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. మేము ఆడుకోవడానికి స్థలం ఎక్కడ రేవంత్‌రెడ్డి, పార్కు స్థలాన్ని అమ్మొద్దు..మాకు ఆటస్థలం కావాలి అంటూ నినాదాలు చేశారు. పిల్లల భవిష్యత్తు, ఆరోగ్యం, ఆటల కోసం ఉన్న పార్కు స్థలాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్థానికులు పేర్కొన్నారు.

**పిల్లల ప్రశ్నకు ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది?..**

మిత్ర హిల్స్‌లో పార్కు కోసం ఉన్న స్థలాన్ని పరిరక్షించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర అవసరాలకు మళ్లించవద్దని స్థానికులు డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరుగుతున్న జనాభా, అపార్ట్‌మెంట్ల కారణంగా పిల్లలకు




ఆటస్థలాలు కరువవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న కొద్దిపాటి పార్కు స్థలాలను కూడా కోల్పోతే భవిష్యత్తులో చిన్నారులకు ఆటలు, వ్యాయామానికి అవకాశం లేకుండా పోతుందని అన్నారు..

**ధర్నాకు బీఆర్ ఎస్ నేతల మద్దతు..**

చిన్నారుల ఆందోళనకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మద్దతుగా నిలిచారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్దఎత్తున ధర్నాలో పాల్గొన్నారు. పార్కు స్థలాన్ని కాపాడాలని, ప్రజల అవసరాలకు ఉపయోగపడే స్థలాలను విక్రయించే నిర్ణయాలను పునరాలోచించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్నారులు ముందుకొచ్చి పార్కు కోసం ఆందోళన చేయడం స్థానికంగా హాట్‌టాపిక్‌గా మారింది. తమ ఆటస్థలం కోసం పిల్లలు వేసిన ప్రశ్నకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆసక్తి నెలకొంది..

# దేశభక్తితో మార్మోగిన పాఠశాలలు..






- **శనివారం ఓల్డ్ బోయినపల్లిలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకల్లో దేశభక్తి..**
- **రెయిన్బో, గ్రీన్‌వుడ్ పాఠశాలలో త్రివర్ణ శోభ ఘన సంబరాలు..**
- **జాతీయ గీతంతో మార్మోగిన ప్రాంగణాలు..**
- **సమరయోధుల వేషాల్లో ఆకట్టుకున్న పిల్లలు .**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 ( సిరి న్యూస్**

శనివారం ఉదయం ఓల్డ్ బోయినపల్లి ప్రాంతం మొత్తం ఒక ప్రత్యేకమైన కళను సంతరించుకుంది. వీధుల్లో నుంచి వెళ్తుంటేనే దూరం నుంచి వినిపిస్తున్న దేశభక్తి పాటలు, పిల్లల కేరింతలు, మైక్‌లో మార్మోగుతున్న జాతీయ గీతం.. ఈ ప్రాంతం మొత్తాన్ని ఒక పండుగ వాతావరణంలోకి తీసుకెళ్లాయి..

**రెయిన్బో పాఠశాలల్లో..**

రెయిన్బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్, గ్రీన్‌వుడ్ హైస్కూల్ ప్రాంగణాలు రెండూ త్రివర్ణ శోభతో మెరిసిపోతూ, 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుకోవడానికి సిద్ధమయ్యాయి. రెయిన్బో పాఠశాల ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే ఎత్తైన స్తంభంపై రెపరెపలాడుతున్న మువ్వన్నెల జెండా అందరి దృష్టిని ఆకర్షించింది. చైర్మన్ నాగూర్ బాబు స్వయంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగానే, వందలాది గొంతులు ఏకమై జాతీయ గీతాన్ని ఆలపించాయి. ఆ క్షణంలో అక్కడున్న ప్రతి ఒక్కరి గుండె దేశభక్తితో ఉప్పొంగింది. ఆ తర్వాత చిన్నారులు వేదికపైకి వచ్చి దేశభక్తి పాటలకు అడుగులు వేశారు. భగత్ సింగ్, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణలో వచ్చిన పిల్లలు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. త్రివర్ణ రంగుల దుస్తుల్లో మెరిసిన ఆ చిన్నారుల మోహాల్లో ఉత్సాహం, గర్వం స్పష్టంగా కనిపించాయి. విద్యా విభాగం సంచాలకురాలు దివ్యభారతి పిల్లల ప్రదర్శనలను అభినందిస్తూ, దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంచడమే నిజమైన విద్య లక్ష్యమని పేర్కొన్నారు. నాగూర్ బాబు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వరంగా రాలేదని, ఎందరో వీరుల త్యాగాల ఫలితమేనని గుర్తు చేస్తూ, ఆ స్ఫూర్తిని గుండెల్లో నింపుకుని దేశ ప్రగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు..

**గ్రీన్‌వుడ్ పాఠశాలల్లో..**

అయితే ఆ రోజు అదే సమయంలో, గ్రీన్‌వుడ్ హైస్కూల్‌లో పాఠశాల గేటు ముందు నుంచే బెలూన్లు, తోరణాలు, త్రివర్ణ రిబ్బన్లతో అలంకరించిన దృశ్యం చూపరులను ఇట్టే ఆకర్షించింది. ఉదయం సమయానికే విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. పాఠశాల యజమాని రమేష్ రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు అత్యంత పకడ్బందీగా జరిగాయి. ఓల్డ్ బోయిన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ జెండాను ఎగురవేయగానే, చప్పట్లు, జేజేలతో ప్రాంగణం మార్మోగింది.

ఆ తర్వాత మొదలైన సాంస్కృతిక ప్రదర్శనలు నిజంగా అందరినీ కట్టిపడేసాయి. చిన్నారులు దేశభక్తి గీతాలకు అణువణువూ ఉత్సాహం ఉట్టిపడేలా నృత్యాలు చేశారు. ఒక్కో పాట మారుతున్న కొద్దీ వేదికపై రంగుల హరివిల్లులా మారిన పిల్లల నృత్య భంగిమలు ప్రేక్షకుల నుంచి భారీ చప్పట్లు అందుకున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో వచ్చిన చిన్నారులు అయితే ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు, ఒకరు గాంధీజీలా కర్రపట్టుకుని నడిస్తే, మరొకరు సుభాష్ చంద్రబోస్ వేషంలో సెల్యూట్ చేస్తూ అందరినీ మంత్రముగ్ధులను చేశారు. వారి అమాయకపు నటన, నిజాయితీగా కనిపించిన ఆ చిన్ని హావభావాలు ప్రేక్షకుల్లో నవ్వులు పూయిస్తూనే, గుండెల్లో దేశభక్తి భావాన్ని రేకెత్తించాయి. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రదర్శనలను ఫోన్లలో బంధిస్తూ, ఆనందం పట్టలేక చప్పట్లతో ప్రోత్సహించడం మరో విశేషంగా నిలిచింది. కొద్దిసేపటికే ఆ ప్రాంగణం మొత్తం ఒక చిన్నపాటి ఉత్సవ వేదికగా మారిపోయింది.

ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం ఎందరో మహనీయుల త్యాగాల ఫలితం. ఆ స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలి అని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నైతిక విలువలను అలవర్చుకుని దేశానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇలాంటి వేడుకలు విద్యార్థుల్లో దేశభక్తి భావనతో పాటు ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, పిల్లల అద్భుత ప్రదర్శనలు పాఠశాల గౌరవాన్ని పెంచాయని అభినందించారు. మధ్యాహ్నం సమయానికి రెండు పాఠశాలల్లోనూ వేడుకలు అధికారికంగా ముగిశాయి. కానీ ఆ చిన్నారుల నృత్యాలు, దేశభక్తి గీతాల ప్రతిధ్వనులు, తల్లిదండ్రుల ఆనంద కేరింతలు మాత్రం ఓల్డ్ బోయినపల్లి వీధుల్లో ఇంకా సేపు నిలిచిపోయాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో సాగిన ఈ వేడుకలు, ముఖ్యంగా గ్రీన్‌వుడ్ హైస్కూల్‌లో జరిగిన ప్రదర్శనలు, ఈ ప్రాంతంలో ఈసారి స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి..

# గీతం 'సెలెస్టియా 2026'తో ఫ్రెషర్స్ కు స్వాగతం

### ఐవోఎంటీ కమ్యూనికేషన్ పై పరిశోధనకు పీహెచ్.డీ

**పటాన్ చెరు, ఆగస్టు 16, (సిరి న్యూస్):**

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకుడు షేక్ జానీ బాషా డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'సురక్షిత ఐవోఎంటీ కమ్యూనికేషన్ కోసం శక్తి సామర్థ్యం గల, డేటా గోప్యతా పరిరక్షణ, ప్రమాణీకరణ పథకం'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఈఈసీఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీతా పాండా ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సిద్ధాంత వ్యాసం, సకాలంలో



విశ్లేషణ, రోగి సంరక్షణ కోసం ఆరోగ్య సంరక్షణ సర్వర్లకు సురక్షితమైన ప్రసారాన్ని నిర్ధారిస్తూనే, వైద్య డేటాను శక్తి-సమర్థవంతంగా సేకరించడానికి వీలు కల్పించే ఒక సమీకృత ఫ్రేమ్ వర్కును ప్రతిపాదిస్తుందని తెలియజేశారు. పరిశోధనలో భాగంగా, డాక్టర్ జానీ బాషా WBANల కోసం ఎనర్జీ అవేర్ లింక్ ఎఫిషియంట్ రూటింగ్ (EALER-W) అనే ఒక వినూత్న రూటింగ్ ప్రోటోకాల్ ను అభివృద్ధి చేశారన్నారు. ఇది మిగిలిన శక్తి దూరం, లింక్ నాణ్యత, హాప్ కౌంట్ వంటి అంశాల ఆధారంగా అత్యంత సమర్థవంతమైన కమ్యూనికేషన్ మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా డేటా ప్రసారాన్ని ఆప్టిమైజ్ చేస్తుందని తెలిపారు. ఈ విధానం వైర్ లెస్ బాడీ ఏరియా నెట్ వర్కులలో (WBANలలో) నెట్ వర్క్ జీవితకాలాన్ని, కమ్యూనికేషన్ విశ్వసనీయతను మెరుగుపరుస్తుందన్నారుఈ పరిశోధన, ఇంప్రూవ్డ్ చింప్ ఆప్టిమైజేషన్ అల్గారిథం (IChOA) ద్వారా ఆప్టిమైజ్ చేసిన హైబ్రిడ్ AE-BiLSTM క్లాసిఫైయర్ ను ఉపయోగించి సింక్ నోడ్ల కోసం ఒక అధునాతన ప్రమాణీకరణ యంత్రాంగాన్ని కూడా పరిచయం చేసిందని పేర్కొన్నారు. గోప్యత, భద్రతను మరింత బలోపేతం చేయడానికి, క్రోనెకర్ ఉత్పత్తి ఆధారంగా ఒక ఆప్టిమైజ్ చేసిన క్రిప్టోగ్రాఫిక్ కీ జనరేషన్ పద్ధతిని అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఇది డేటా సమగ్రత, గోప్యతను కాపాడుతూనే, సింక్ నోడ్లు, సర్వర్ల మధ్య సురక్షితమైన ఆరోగ్య సంరక్షణ డేటా మార్పిడిని నిర్ధారిస్తుందన్నారు. డాక్టర్ జానీ బాషా సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.ఎం.ప్రశాంత, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# విటమిన్ 'డి' లోపం.. ఇవే అనారోగ్య సమస్యలు




మనిషి శరీరానికి విటమిన్ విటమిన్ 'డి' చాలా అవసరం. ఇది లోపించడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. శారీరక సమస్యలు, మానసిక సమస్యలు కూడా వస్తాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. విటమిన్ లోపం వల్ల డిప్రెషన్ కు లోనవుతారని దాని నుంచి బయటపడేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు.

డిప్రెషన్ అనేది ఒక సాధారణ సమస్య. దీనికి చాలా కారణాలు ఉండొచ్చు. విటమిన్ డిని సన్‌షైన్ విటమిన్ అని కూడా పిలుస్తారు, ఇది మన శరీరంలో అనేక ముఖ్యమైన విధులను నిర్వహిస్తుంది. ఇది ఎముకలను దృఢంగా ఉంచుతుంది. రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. మానసిక స్థితిని నియంత్రిస్తుంది. కాబట్టి శరీరానికి చాలా ముఖ్యమైనదిగా పరిగణిస్తారు.

ఎండలో తక్కువ సమయం గడపడం వల్ల విటమిన్ డి లోపం ఏర్పడుతుంది. శరీరంలో ఎముకలు బలహీనపడటం, జుట్టు రాలడం మొదలైన అనేక సమస్యలు వస్తాయి. దీంతో పాటు డిప్రెషన్ కు లోనవుతారు.

విటమిన్ డి మెదడులో సెరోటోనిన్ స్థాయిలను పెంచడానికి సహాయపడుతుంది, ఇది మానసిక స్థితిని నియంత్రించే న్యూరోట్రాన్స్మిటర్. విటమిన్ డి స్థాయిలు తక్కువగా ఉన్నప్పుడు, సెరోటోనిన్ స్థాయిలు కూడా తగ్గుతాయి. తద్వారా డిప్రెషన్ వస్తుంది. విటమిన్ డి లోపం ఆందోళన, బైపోలార్ డిజార్డర్ , ఇతర మానసిక ఆరోగ్య సమస్యలతో కూడా ముడిపడి ఉంటుంది. కాబట్టి రోజు కనీసం ఒక గంట పాటు ఎండలో తిరగాలని, సూర్య కిరణాలు తాకేలా చూసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ప్రకృతి సిద్ధంగా దొరికే డి విటమిన్ ను కూడా ఆస్వాదించలేకపోతున్నారని ఇది చాలా ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.




# నూడుల్స్ తింటున్నారా.. అయితే జాగ్రత్త



ఇన్‌స్టంట్ నూడుల్స్‌లో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు తక్కువగా ఉంటాయి. సోడియం ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తపోటు పెంచడమే కాకుండా గుండె సంబంధిత వ్యాధులకు కారణమవుతుంటాయి. ఈ ఇన్ స్టంట్ న్యూడుల్ అధిక కొవ్వు ఉత్పత్తి అవుతుంది. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. అయితే కొన్ని నూడల్స్ బ్రాండ్ లలో ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపేవి ఉంటాయి. ముఖ్యంగా దీనివల్ల రక్తంలో చక్కెర పెరుగుదల ప్రారంభం అవుతుంది. అధిక బరువు సమస్యలు తలెత్తవచ్చు. పోషక విలువలు అందకుండా పోతాయి.

విటమిన్స్ , మినరల్స్, ఫైబర్ లోపం తలెత్తి, శరీరం బలహీనంగా మారిపోతుంటుంది. అందుకే నూడుల్స్ ను ఎక్కవగా కాకుండా తక్కువ తినాలని పిల్లలకు దూరంగా ఉంచాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# కాలేయ వ్యాధి లక్షణాలు ఇవే..

మానవ శరీరంలో కాలేయం ఆరోగ్యం చాలా ముఖ్యం. మన జీవనశైలిలో కాలేయం ఆరోగ్యంగా ఉంటే చాలా వరకు ఇబ్బందులు తలెత్తవు. కాలేయం ఆరోగ్యం కోసం సిగరెట్, మద్యానికి దూరంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అధిక కొవ్వు, చక్కెర, ప్రాసెస్డ్ ఫుడ్స్ తినడం వల్ల కాలేయం దెబ్బతింటుంది. వీటికి ఎక్కువగా దూరంగా ఉండాలని చెబుతున్నారు.

హెపటైటిస్ ఏబీసీడీఈ లాంటి వైరస్ ల వల్ల కాలేయం చెడిపోతుంది. నాన్ఆల్కహలిక్ ఫ్యాటీ లివర్ ఆల్కహలిక్ ఫ్యాటీ లివర్ కాలేయం లో కొవ్వు మోతాదుపెరిగి దాని పనితీరు క్షీణిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయి అధికంగా ఉండడం వలన కాలేయం మీద ఒత్తిడి పెరుగుతుంది, దీని ఫలితంగా కాలేయం దెబ్బతింటుంది. కొంత మందికి కాలేయ వ్యాధులు వారసత్వం కింద వస్తుంటాయి. కాలేయం పై రసాయనాలు, మందులు ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. అధిక బరువుతో కూడా కొన్ని సార్లు లివర్ డ్యామేజీకి కారణం అవతుంటుంది.

కాలేయ వ్యాధికి కారణమయ్యే లక్షణాలు ఇలా ఉంటాయి. దురద చర్మం, వికారం లేదా వాంతులు, మలం రంగులో మార్పు, కడుపు నొప్పి, వాపు, మూత్రం రంగులో మార్పు, చర్మం, కళ్ళు పసుపు రంగులోకి మారడం లాంటి లక్షణాలు కనిపిస్తుంటాయి



# 'సనాతన ధర్మం'పై నా మాటలు వక్రీకరించారు



నటి అనసూయ మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల హిందూ ధర్మంపై ఆమె చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సనాతన ధర్మాన్ని అవమానించారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ వ్యవహారంపై అనసూయ స్పందిస్తూ ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘ పోస్టు పెట్టారు. తన వ్యాఖ్యలను కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించారని, తాను ఏ మత విశ్వాసాలనూ కించపర్చేలా మాట్లాడలేదని వివరణ ఇచ్చారు. "నా మాటలను కొందరు కావాలనే వక్రీకరిస్తున్నారు. అందుకే ఈ వివరణ ఇవ్వాల్సి వస్తోంది. నేను మాట్లాడింది కొంతమంది గురించి మాత్రమే. నాపై అభ్యంతర కామెంట్లు చేస్తూ, వ్యక్తిగత దాడులు, బెదిరింపులకు దిగే వాళ్ల గురించే నేను చెప్పాను. అది ఏ మతాన్ని గానీ, వర్గాన్ని గానీ ఉద్దేశిస్తూ చెప్పిన మాట కాదు. నన్ను టార్గెట్ చేస్తున్న వాళ్లకు ఒక విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నా. నేను సనాతన ధర్మాన్ని పాటించే హిందువుని. నా ధర్మం, విలువలు, విశ్వాసాల పట్ల నాకు ఎలాంటి చింత లేదు. ధైర్యంగా ఉండటం.. నిజం వైపు నిలబడటం, తప్పును తప్పు అని చెప్పడం, ఎదుటివారిని మనిషిగా గౌరవించడం.. ఇవన్నీ నాకు ధర్మమే నేర్పింది. హనుమాన్ జీ ధైర్యం, బలమే నాకు స్ఫూర్తి. అందువల్ల అన్యాయం జరిగినప్పుడు మాట్లాడకుండా ఉండలేను. నా మాటల నుంచి అసలు విషయం తొలగించి.. సనాతన ధర్మాన్ని అవమానించినట్లుగా వక్రీకరించి ప్రచారం చేయడం సరికాదు. మతం ఆధారంగా నేను ఎవరిపైనా ఓ నిర్ణయానికి రాను. వేధించే వాళ్లను మాత్రమే ప్రశ్నిస్తా. అందువల్ల ఎడిట్ చేసిన క్లిప్‌లు, సగం సగం కథనాల వలలో పడకండి. అన్ని విషయాలు తెలుసుకున్న తర్వాతే ఓ అభిప్రాయానికి రండి" అని అనసూయ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్'కు హోస్ట్‌గా సమంత..

ఇటీవల 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకున్న టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత.. ప్రస్తుతం ప్రెగ్నెన్సీ క్రేవింగ్స్‌ను ఎంజాయ్ చేస్తూ సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. అయితే.. తమిళంలో మాత్రం ఓ ఓటీటీ షో చేయబోతున్నట్లు ఇదివరికే ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ షోకు సంబంధించిన అఫీషియల్ అప్డేట్ వచ్చింది. రాబోయే రియాలిటీ షో 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళం'కు సమంత రూత్ ప్రభు హోస్ట్‌గా చేయబోతున్నట్లు సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా తాజాగా ప్రకటించింది. ఆహార సంబరంగా సాగే ఈ షో, సోనీ విజా అండ్ సోనీ లివ్ వేదికల ద్వారా ప్రసారం కానుంది. ఇందులో తమిళ వినోద రంగానికి చెందిన ప్రముఖ తారలు పాల్గొననున్నారు. 'ఈ విషయాన్ని సోనీ లివ్, సోనీ విజా ప్రకటిస్తూ.. 'సమంత 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళం' షోకు హోస్ట్‌గా వ్యవహరించడానికి సిద్ధమయ్యారు! ప్రముఖులు, వంట, వినోదం మరియు పోటీల అద్భుత కలయికను ఆస్వాదించడానికి సిద్ధంగా ఉండండి! త్వరలో SonyVizha & SonyLIV లో ప్రసారం కానుంది' అని తెలిపారు.

ఇక ఈ కార్యక్రమం గురించి సమంత మాట్లాడుతూ.. "సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళం' నేను ఇంతకుముందు చేసిన వాటికి పూర్తిగా భిన్నమైనది. అందుకే దీని గురించి నన్ను సంప్రదించినప్పుడు కాదు అని చెప్పలేకపోయాను. ఆహారానికి ప్రజలను ఏకం చేసే, మధురమైన జ్ఞాపకాలను సృష్టించే, మరియు సాధారణంగా కెమెరాలకు కనిపించని మనలోని మరో కోణాన్ని ఆవిష్కరించే అద్భుతమైన శక్తి ఈ షోకు ఉంది. మనకు ఇష్టమైన తమిళ ప్రముఖులు వంటగదిలోకి అడుగుపెట్టి, సాహసాలు చేస్తూ, పొరపాట్లు చేస్తూ, తమను తామే ఆశ్చర్యపరుచుకుంటూ, ఊహించిన దానికంటే ఎంతో ఎక్కువ ఉత్సాహంతో పోటీపడటం చూడటం నాకు ఎంతో ఉత్సాహాన్నిస్తోంది.. త్వరలోనే మన వంటగదిలో కలుద్దాం' అని చెప్పుకొచ్చింది.



# లెఫ్టినెంట్ కల్నల్‌గా వెంకీ



లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డిగా ప్రేక్షకుల ముందుకు రానున్నారు కథానాయకుడు వెంకటేశ్. ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో చేస్తున్న మల్టీస్టారర్ చిత్రం కోసమే ఆయనీ కొత్త అవతారమెత్తారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న సినిమా ఇది. సురేశ్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. వెంకీతో పాటు కల్యాణ్‌రామ్ మరో కథానాయకుడిగా నటిస్తున్నారు. చిత్ర పరిశ్రమలోకి వచ్చి వెంకటేశ్ 40ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో శుక్రవారం ఈ సినిమా నుంచి ఆయన ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. అందులో తను శక్తిమంతమైన ఆర్మీ అధికారిగా.. ఆకట్టుకునేలా కనిపించారు. లెఫ్టినెంట్ కల్నల్ అయిన ఆయన కౌంటర్ టెర్రరిజం, హోస్టేజ్ నెగోషియేషన్‌లో నిపుణుడిగా కనిపిస్తారని చిత్ర వర్గాలు తెలియజేశాయి. వినోదం, కుటుంబ భావోద్వేగాల మేళవింపుగా రూపొందుతున్న ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. ఇది వచ్చే ఏడాది సంక్రాంతికి రానుంది. ఇందులో వెంకీకి జోడీగా కీర్తి సురేశ్, కల్యాణ్‌రామ్‌కు జంటగా కృతిశెట్టి నటిస్తున్నారు.

# అప్పుడు బెదిరించారు.. నంబర్ లీక్ చేశారు



సోషల్ మీడియాలో వచ్చే ట్రోలింగ్, అసభ్య కామెంట్స్ తన మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపాయని నటుడు విక్రాంత్ మాస్సే తెలిపారు. 'ది సబర్మతి రిపోర్ట్' సినిమా విడుదలైన తర్వాత తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను ఓ టాక్ షోలో పంచుకున్నారు.

"నేను ది సబర్మతి రిపోర్ట్ చేసినందుకు గర్వపడుతున్నాను. చాలామంది ఈ చిత్రంపై విమర్శలు గుప్పించారు. నన్ను అసభ్యంగా తిట్టారు. నా వాట్సాప్ నంబర్, కారు నంబర్ లీక్ చేశారు. కొందరు బహిరంగంగానే నన్ను బెదిరించారు. అప్పటికి మాకు బాబు పుట్టి ఆరు నెలలే. ఆ బెదిరింపులతో తీవ్రంగా ప్రభావితమయ్యాను. అలా బెదిరించే వారంతా పిరికివారని తర్వాత అర్థం చేసుకున్నాను. జనాలు నా గురించి ఏం మాట్లాడుకుంటున్నారనేది నాకు అనవసరం. నా కుటుంబం, నా అనుకున్న వారి బాధ్యతే నాకు ముఖ్యం. వారికి మాత్రమే నేను జవాబుదారీ" అని విక్రాంత్ తెలిపారు. 2002 గోద్రా రైలు ఘటన ఆధారంగా తెరకెక్కిన పొలిటికల్ థ్రిల్లర్ 'ది సబర్మతి రిపోర్ట్' 2024 నవంబర్‌లో విడుదలైంది. ప్రస్తుతం విక్రాంత్ మాస్సే నటించిన 'ముసాఫిర్ కేఫ్' సీజన్ 2 నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంది.

# స్వాతంత్ర్య దినోత్సవం.. నాకు పండగలాంటిది



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆర్మీ కుటుంబంలో జన్మించిన తనకు ఆగస్టు 15 అంటే ఎనలేని అభిమానమని తెలిపారు. రకుల్ తండ్రి కుల్విందర్ సింగ్.. భారత సైన్యంలో కల్నల్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందారు. ఆయన బదిలీల కారణంగా రకుల్ బాల్యమంతా బోర్డర్ ఏరియాల్లో, ఆర్మీ వాతావరణంలోనే గడిచింది. "ఆర్మీ కుటుంబంలో పుట్టిన నాకు స్వాతంత్ర్య దినోత్సవం అంటే సాధారణ సెలవురోజు కాదు.. అదో పెద్ద పండగ. నేను దిల్లీలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నాను. ఆగస్టు 15న.. మా పాఠశాలలో జరిగిన వేడుకలు నా జీవితంలో అత్యుత్తమ జ్ఞాపకాలుగా నిలిచిపోయాయి. పాఠశాల రోజుల్లో దేశభక్తి గీతాల పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొనేదాన్ని. దేశం కోసం పాటలు పాడడం ఎంతో గర్వంగా అనిపించేది" అని రకుల్ ఓ

# సంక్రాంతి బరిలో 'సంబరాల ఏటిగట్టు'..



సాయిదుర్గా తేజ్ కథానాయకుడిగా రోహిత్.కె.పి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'సంబరాల ఏటి గట్టు'. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ విడుదల తేదీ ఖరారైంది. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 12న సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

'రూ.125 కోట్ల వ్యయంతో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్న చిత్రమిది. సాయిదుర్గా తేజ్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్. పీరియాడిక్ కథతో ప్రేక్షకులకు ఓ గొప్ప అనుభవాన్ని పంచేలా తెరకెక్కిస్తున్నాం. భారీ హంగులతో చిత్రీకరిస్తున్న ఈ మూవీ తెలుగుతోపాటు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లోవిడుదల కానుంది' అని సినీ వర్గాలు తెలిపాయి. జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి బి.అజనీశ్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు.

# రీరిలీజ్‌కు సిద్ధమైన 'నువ్వే నువ్వే'..



తరుణ్, శ్రియ జంటగా నటించిన చిత్రం 'నువ్వే నువ్వే'. అప్పటివరకు కథ, మాటలు, స్క్రీన్‌ప్లే రచయితగా పనిచేసిన త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అయ్యారు. 2002లో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ మూవీతో తరుణ్, శ్రియ, త్రివిక్రమ్‌లకు అద్భుతమైన గుర్తింపు లభించింది. కోటి సంగీత సారథ్యంలో రూపొందిన ఈ చిత్రాన్ని శ్రీ స్రవంతి మూవీస్ బ్యానర్‌పై ఎస్. రవికిశోర్ నిర్మించారు. ఈ మధ్యకాలంలో తెలుగు సినిమా పరిశ్రమలో రీరిలీజ్‌ల ట్రెండ్ జోరుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇక 'నువ్వే నువ్వే' చిత్రాన్ని కూడా రీరిలీజ్ చేయనున్నారు. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా తాజాగా విడుదలైంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో రీరిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. రీరిలీజ్‌లో భాగంగా ఈ సినిమా ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.